నేటి కందం- నేటికి అందం



జాతికి హరితము నొసగెడి
ప్రాతిభమై వన మహోత్సవమ్మును జరుపన్
ప్రీతిగ శ్లాఘింతు కవన
రీతులలో ముఖ్యమంత్రి రేవంతు కలన్ !!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు వనమహోత్సవాన్ని ప్రారంభించారు



-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


చురక

వనమహోత్సవంకన్నా
వన సంరక్షణ మిన్నా
చెట్లు నాటి వదిలేస్తే
శ్రమ ఫలితం సున్నా
అవినీతి చీడ దాంట్లో
అడుగున తిరిగే జోరు
చక్కదిద్ది సాగకుంటే
సర్కారుకు చెడ్డ పేరు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 8-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:248 పేజీలు:6 వెల: రూ.1/-

# విద్యార్థులు సామాజిక బాధ్యత తీసుకోవాలి : జిష్ణుదేవ్ వర్మ

## -అట్టహాసంగా స్నాతకోత్సవం
## -564 బంగారు పతకాలు, 387 పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం

వరంగల్, జులై 7:విద్యార్థులు డిగ్రీలతో పాటు దేశాభివృద్ధికి, సమాజ అభివృద్ధికి బాధ్యతలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, కాకతీయ విశ్వవిద్యాలయ కులపతి జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన 23వ స్నాతకోత్సవం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయానికి ఘన చరిత్ర ఉందన్నారు. విశ్వవిద్యాలయం ఏర్పడి 50ఏళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో విద్యార్థులు డిగ్రీలు తీసుకోవడం గొప్ప అవకాశంగా భావించాలన్నారు. 672 ఎకరాలలో 23 విభాగాలు, ఏడు కళాశాలలు, 500 అనుబంధ కళాశాలలతో ఉత్తర తెలంగాణ లో మంచి పేరున్న విశ్వవిద్యాలయం అన్నారు. ఇక్కడ విద్య అభ్యసించిన వారు సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

564 బంగారు పతకాలు..

యూనివర్సిటీలో విద్యార్థులకు 564 బంగారు పతకాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. అలాగే 387 పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు. కార్యక్రమానికి మరో అతిథిగా శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు, పూర్వ ఉపకులపతులు, వివిధ విభాగల డీన్లు, పరీక్షల విభాగం అధికారులు, పాలు విభాగాల కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘన స్వాగతం పలికిన మేయర్, ఎమ్మెల్యే, కలెక్టర్లు

హనుమకొండ: వరంగల్ ఎన్ఐటికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీజీఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కుడా ఛైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలను అందించి ఘనంగా స్వాగతం పలికారు.

ఇవాళ కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల చాన్స్ లర్ జిష్ణు దేవ్ వర్మ వరంగల్ ఎన్ఐటీకి చేరుకోగా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు స్వాగతం పలికిన వారిలో వరంగల్ ఎన్ఐటి డైరెక్టర్ బిద్యాధర్ సూబుది, వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబర్ ఈవీ. శ్రీనివాస్ రావు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కాజీపేట తహసీల్దార్ భావు సింగ్, ఇతర అధికారులు ఉన్నారు.

# వనమే మనం, మనమే వనం

## -ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుంది
## - ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

రంగారెడ్డి జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వనమే మనం, మనమే వనం అని పెద్దలు చెప్పారని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని యూనివర్సిటీ ప్రాంగణంలో రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్సవం-2025 ను ప్రారంభించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, లక్ష్యాన్ని పూర్తి చేయుటకు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అందరు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని దేశ ప్రధాని పిలుపునిచ్చారని, ప్రధాని పిలుపును సాదరంగా ఆహ్వానిస్తూ ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో రెండు మొక్కలు నాటాలని కోరారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కను నాటాలని, ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని, మీ పిల్లల్లాగే నాటిన మొక్కలను సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని, ఆర్టీసీలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా, ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని తెలియజేశారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పట్టణ ప్రాంతాల్లో మహిళలు కూడాను మహిళా సంఘాల్లో చేరేలా కృషి చేయాలన్నారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు రుణాలు అందించామని, అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ రాబోతోందని, వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమెల్యే సీట్లు ఇచ్చేబాధ్యత తానే తీసుకుంటానాని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. వృక్షో రక్షిత రక్షితః చెట్లను పెంచడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవడం జరుగుతుందని, జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతామని అన్నారు. చెట్లను పెంచడం ద్వారా వర్షాలు సకాలంలో కూరుస్తాయని, వంద శాతం మొక్కలు నాటేందుకు కృషి చేయాలని, భౌగోళిక పరిస్థితి మెరుగుపడే విధంగా రాష్ట్రమంతా విరివిగా వనాలు పెంచాలని, అందుకు అందరూ భాగస్వాములు కావాలని కొండా సురేఖ సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్, కమిషనర్ కర్ణన్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఉన్నతాధికారులు. తదితరులు పాల్గొన్నారు.



# భారత్, పాక్‌ను ఒకే త్రాసులో తూకం వేయలేం : ప్రధాని మోదీ

బ్రెజిల్ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పొరుగుదేశం పాకిస్థాన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. పాక్ ఉగ్రవాద మద్దతుదారని, భారత్ ఉగ్రవాద బాధిత దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేమన్నారు. 'పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తోంది. భారత్ మాత్రం ఉగ్రవాద బాధితురాలిగా ఉంది. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేం' అని ప్రధాని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు మౌనంగా మద్దతు ఇవ్వడం కూడా ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని ఖండించడంలో భారతదేశానికి మద్దతుగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

పహల్గాం ఉగ్ర దాడిని ఖండించిన బ్రిక్స్..

బ్రెజిల్‌లోని రియో డీ జెనీరలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్ర దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రదాడులు ఎక్కడ జరిగినా ముక్త కంఠంతో ఖండిస్తున్నామని, టెర్రరిజం ఏ రూపంలో ఉన్న వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'రియో డీ జెనీరో డిక్లరేషన్'ను సభ్యదేశాలు విడుదల చేశాయి. 'ఏప్రిల్ 22న జముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తున్నాం. క్రాస్ బార్డర్ టెర్రరిజంతోపాటు ఉగ్రవాదులకు నిధులు అందిస్తున్నా, ఆశ్రయం కల్పించడాన్ని ఖండిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో కలిసికట్టుగా ముందుకు వెళ్తాం. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని అందులో పేర్కొన్నాయి. అయితే ఈ తీర్మానంలో ఎక్కడా పాకిస్థాన్ పేరు ప్రస్తావించలేదు

# ప్రజా సమస్యలపై జవాబుదారితనంతో పనిచేయాలి : కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జులై 7: ప్రజా సమస్యలపై జవాబుదారితనంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కొల్చారం తహసీల్ కార్యలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ కార్యకలాపాలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రికార్డుల భద్రత క్రమ పద్ధతిలో ఉండాలన్నారు.

భూ భారతి సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం రికార్డు రూమును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసచారి, నాయిబ్ తహసీల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ తో అజయ్ దేవగన్, కపిల్ దేవ్ భేటీ




న్యూఢిల్లీ, జులై 7:ఢిల్లీ పర్యటన లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని ప్రముఖ బాలీవుడ్ హీరో అజయ్ దేవగణ్ నేడు కలిశారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రికి అజయ్ దేవగణ్ హామీ ఇచ్చారు.

ఏఐ సాంకేతికత జోడింపుతో వీఎఫ్ఎక్స్, స్మార్ట్ స్టూడియోలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు సీఎంకు అందజేశారు.

మాజీ క్రికెటర్ కపిల్ దేవ్‌తో భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఢిల్లీలోని ఆయన నివాసంలో ఇండియా క్రికెట్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై చర్చించారు. దీనికి సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రికి కపిల్‌దేవ్ వివరించారు.

# విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం బోధన జరిగేటట్లు చూడాలి : ఎంఈవో గోపాల్

హైదరాబాద్, జులై 7:విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం బోధన జరిగేటట్లు చూడాలని మండల విద్యాధికారి గోపాల్ అన్నారు. సోమవారం పరిగిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు శుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని వడ్డించాలని మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని, నాణ్యతలో తేడా ఉండరాదని సూచించారు.

పాఠశాలలో విద్యార్థుల చదువుపై విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్యాంశాల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అనంతరం వారికి విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థులందరికి పాఠ్యాంశ షెడ్యూల్ ప్రకారంబోధన జరిగేటట్టు చూడాలని, ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.కృష్ణా రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సి ఆర్ పి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాల దిశగా యాదగిరిగుట్ట దేవస్థానం

## -హెచ్.వై.ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి తో ఈవో భేటీ
## -ఉత్తమ నాణ్యత ప్రమాణాల దిశగా ప్రసాదాల తయారీ
## -గ్రీన్ అండ్ ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ స్టాండర్డ్స్ పై అధ్యయనం
## - దేవస్థానం ఎలక్ట్రికల్ వైరింగ్ మేనేజ్మెంట్ పై థర్డ్ పార్టీ ఆడిట్
## -ఈవో వెంకట్రావు కృషిపై భక్తుల్లో హర్షం



యాదగిరిగుట్ట జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): : తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానాన్ని తీర్చిదిద్దే క్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావు కృషి పై భక్తుల్లో ఆనందం కనిపిస్తోంది. భక్తుల సౌకర్యాలపై దృష్టి కేంద్రీకరించడంతోపాటు, దేవస్థానంలోని అన్ని శాఖలలో లోటుపాట్లను సరిదిద్దేందుకు ప్రక్షాళన చర్యలు తీసుకుంటున్నారు. "తిరుపతి లడ్డు బి యాదగిరిగుట్ట పులిహోర " ప్రసాదం రుచిగా , శుచిగా ఉంటాయని ప్రతీతి. అందుకే ఫుడ్ సేఫ్టీ ఫర్ ప్రసాదం అనే విషయంలో స్టాండర్డ్స్ పై చర్యలకు ఉపక్రమించారు. ఊజఓ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివయ్య తో ఈవో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. చర్చించారు. అదేవిధంగా దేవస్థానం నిర్వహిస్తున్న గ్రీన్ అండ్ ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ స్టాండర్డ్స్ పై కూడా ఆయన దృష్టి కేంద్రీకరించారు. ఈ విషయాలలో నాణ్యత ప్రమాణాలు ,అర్హతలు వంటి అంశాలను పరిష్కరింపజేయనున్నారు. అలాగే దేవస్థానం ఎలక్ట్రికల్ ఆడిట్ కూడా నిర్వహించనున్నారు. ఈ విషయంలో దేవస్థానం ఎలక్ట్రికల్ వైరింగ్ మేనేజ్మెంట్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించదలిచారు. ఊజఓ సంస్థ థర్డ్ పార్టీగా వ్యవహరిస్తోంది. వీటికి సంబంధించిన పూర్తి సమాచారం ఇంకా అందాల్సి ఉంది.

# ఇస్రో చీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడిన శుభాన్షు శుక్లా

బెంగుళూరు, జులై 7: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా .. భారతీయ అంతరిక్ష కేంద్రం చైర్మెన్ వీ నారాయణన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా శుక్లా ఐఎస్ఎస్ వెళ్లిన విషయం తెలిసిందే. తన ఐఎస్ఎస్ ప్రయాణం సురక్షితంగా సాగేందుకు ఇస్రో సహకరించినట్లు శుక్లా చెప్పారు. జూలై 6వ తేదీన మధ్యాహ్నం వీ నారాయణన్‌తో శుక్లా సంభాషించినట్లు ఇస్రో తెలిపింది. శుక్లా ఆరోగ్య సమాచారం గురించి ఆసక్తిగా చైర్మెన్ అడిగి తెలుసుకున్నారు.



స్పేస్ స్టేషన్‌లో జరుగుతున్న వివిధ రకాల శాస్త్రీయ పరిశోధనల గురించి కూడా ఆరా తీశారు. అన్ని పరిశోధనలు, కార్యక్రమాలకు చెందిన శుక్లా అనుభవాలను డాక్యుమెంట్ ఛేయాలని ఇస్రో చైర్మెన్ భావిస్తున్నారు. గగన్‌యాన్ ప్రోగ్రామ్ చేపడుతున్న నేపథ్యంలో శుక్లా అనుభవాలు ఉపయోగపడుతాయని ఇస్రో అంచనా వేస్తున్నది.

# ప్రజావాణి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ హనుమంతరావు

నల్గొండ, జులై 7: ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వర పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సిబ్బందికి సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి సమస్యలపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారాలు చూపాలన్నారు. సోమవారం నాటి ప్రజావాణిలో 48 అర్జీలను స్వీకరించగా అందులో రెవెన్యూ శాఖకు- 34, పంచాయతీ శాఖకు-5, వ్యవసాయ శాఖకు-2, గ్రామీణాభివృద్ధి శాఖకు-2, హౌసింగ్, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్, మున్సిపాలిటీ, జిల్లా సంక్షేమ శాఖ, ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, బడిబాట, వన మహోత్సవం, ఇందిరా మహిళా శక్తి వంటి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్షించి మాట్లాడారు.

జిల్లాలో మొదటి విడతలో గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంకా పునాది తీసుకోని వారిని త్వరగా తీసుకునేలా మండల తాసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. బేస్‌మెంట్ తీసుకున్న వారికి ప్రతి సోమవారం రూ. లక్ష వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందని, చాలా మంది ప్రైవేట్ స్కూల్స్‌లో చదివే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పొందుతున్నట్లు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మొక్కలు నాటిన తర్వాత, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత కూడా మొక్క నాటిన వారిపై ఉందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. మహిళలకు సోలార్ ప్లాంట్, ప్రెటోల్ బంక్‌లు, మహిళా శక్తి క్యాంటీన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సౌమ్యత, సహనాలకు నిదర్శనం గోమాత !

## (08 జూలై "గోమాత ప్రశంస దినోత్సవం" సందర్భంగా)

నిస్వార్థ త్యాగం, సౌమ్యత, సహనానికి చిహ్నం గోమాత. హిందూ సమాజంలో గోమాతను దేవతారూపంగా కొలవడం, సంరక్షించే తల్లిగా కొలుస్తారు. హిందూ పురాణాల్లో ఆవును తల్లిగా వర్ణించబడి ఒక దైవిక గోమాతగా ఆరాధిస్తారు. సమృద్ధికి మారు పేరు ఆవు. ఆమె శరీరంలో వివిధ దేవతలను చూపడం జరుగుతుంది. శివుడి ముందు నంది పూజలు అందుకుంటుంది. కోర్కెలు తీర్చే ఆవును కామధేనువు లేదా సురభి అని పిలుస్తాం. కామధేనువు, ఆమె కూతురు నందిలు సంపదకు, సంతానోత్పత్తి, శ్రేయస్సును ప్రసాదిస్తుందని నమ్ముతారు. జగన్నాథుడు, వారి బంధువులు ఆవులతో సంబంధాన్ని కలిగి గోకులంగా పిలువబడుతున్నది.

గోవుల ప్రశంస దినోత్సవం-2025:

సకల మానవాళికి ఆవులు చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ప్రతి ఏట జూలై మాసంలోకి రెండవ మంగళవారం, అనగా 08 జూలై 2025న జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. అమెరికాలో గోరక్షణ చేయాలంటూ, మాంసం కోసం అమాయక జీవులైన ఆవులను వాడవద్దని, దానికి బదులుగా చికెన్ తినాలంటూ చేసిన ప్రచారంలో భాగంగా "గోవు ప్రశంస దినం" ప్రారంభమా నేడు పలు దేశాల్లో కూడా నిర్వహించబడుతున్నది. ఆవులు చేస్తున్న సేవలను అవగాహన పరచడం, వాటి సంరక్షణ అవసరాలను గుర్తించం, వాటిని కుటుంబ సభ్యులుగా భావించడంతో పాటు ఆవులను మాంసం కోసం వాడవద్దనే భావనలను వ్యాప్తి చేయడానికి ఈ వేదికలు ఉపయోగపడతాయి. ఆవుల లాంటి జీవులను మాంసం కోసం పెంచడం వల్ల పర్యావరణ విధ్వంసం, వాతావరణ మార్పులు, సుస్థిరత, అడవుల నరికివేత, జీవవైవిధ్య నష్టాలు లాంటివి కూడా ప్రభావితం అవుతాయని గమనించాలి.

సౌమ్యత, సమృద్ధి, శ్రేయస్సుకు ప్రతిరూపాలు గోమాతలు:

మానవ జీవితాలతో తమ బతుకులను పెనవేసుకున్న సౌమ్య జీవులుగా ఆవులు మానవాళికి పాలు, పాల ఉత్పత్తులు, తోలు, ఔషధాలు, సహజ ఎరువు, వ్యవసాయ రంగంలో నాగలి/బండి లాగడం లాంటి ప్రయోజనాలు కలిగిన ఆవులు పలు దేశాలు, జాతుల ప్రజలకు మాంసం కూడా అందించే నిస్వార్థ జీవులుగా మనల్ని ఆదుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆవుల్లో వెయ్యికి పైగా జాతులు ఉన్నాయి. వేల సంవత్సరాలుగా ఆవులు మానవ జీవితాలతో సంబంధాన్ని కలిగి ఉంటున్నాయి. పశ్చిమ భారతంలో, ముఖ్యంగా హిందూ సమాజంలో గోవును పవిత్ర ద్రవరూపంగా భావించి పూజించే సంస్కృతి ఉన్నది.

అహింస, సమృద్ధికి ప్రతిరూపాలుగా ఆవాలు త్యాగజీవులుగా భావించబడుతున్నాయి. హిందువులు గోవులను రక్షించడానికి గోశాలలు కూడా నిర్వహించడం కొనసాగుతున్నది.

సగటున 25 ఏండ్ల వరకు జీవించగల ఆవులు శాఖాహారులు కాబట్టి దానిని మాంసం కోసం వాడవద్దనే ప్రచారం కొనసాగుతున్నది. రోజుకు దాదాపు 10 గంటలు పడుకునే ఆవులు దాదాపు 5 – 7 కిమీ దూరం వరకు వాసన పసిగట్టగలవు. ఇలాంటి పలు ప్రయోజనాలు కలిగిన కామధేనువులైన ఆవులను కాపాడుకోవడం, దైవ రూపం భావించడం కొనసాగిద్దాం. సమృద్ధి, శ్రేయస్సులను పొందుదాం.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

## ఆహ్వానం-జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్, జులై 7:(నేటినిజం ప్రతినిధి): "నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అడ్మిషన్ల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. చివరి తేదీ జూలై 29, 2025 వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల్ని ఆహ్వానిలస్తున్నారని, ఈ నోటిఫికేషన్‌ను నవోదయ విద్యాలయ సమితి విడుదల చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేయు విద్యార్థులు https://navodaya.gov.inని వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన సూచించారు.

అర్హతలువిద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థానిక నివాసితులై ఉండాలి. 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి వరంగల్ జిల్లాలో చదువుతూ ఉండాలి. 2014 మే 1 నుండి 2016 జూలై 31 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులు. ప్రభుత్వ / ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3వ మరియు 4వ తరగతులు పూర్తిచేసి ఉండాలి. అన్ని పాఠశాలలకు సమాచారం అందించి విద్యార్థులు దరఖాస్తు చేయు విధముగా అవగాహన కల్పించాలని డీఈఓ కు సూచించారు. పరీక్షా నిర్వహణ తేదీ: డిసెంబర్ 13, 2025విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఉత్తమ విద్యా బోధన కలిగిన నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమాచారం కొరకు 9110782213, 7993263431హెల్ప్ లైన్ నంబర్లకు కాల్ చేయాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జవహర్ నవోదయ కళాశాల ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ, నవోదయ కళాశాల మాథ్స్ ఉపాధ్యాయులు సురేష్ కుమార్, లైబ్రేరియన్ లక్ష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ స్వాగతం పలికిన అధ్యక్షుడు మిలీకి ప్రధానమంత్రి కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, జులై 7:ఇరువురు నేతలు పరిమిత, ప్రతినిధి బృందం స్థాయిలో సమావేశమయ్యారు. పలు అంశాలపై విస్తృత చర్చలతో పాటు ద్వైపాక్షిక సంబంధాల పరిధిని సమీక్షించారు. కీలక ఖనిజాలు, చమురు, గ్యాస్, రక్షణ, అణుశక్తి, వ్యవసాయం, శాస్త్ర-సాంకేతికత, వ్యవసాయంలో డ్రోన్ల వాడకం, మత్స్య సంపద, విద్యుత్ ప్రసార మార్గాల పర్యవేక్షణ, ఐసీటీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యూపీఐ, అంతరిక్షం, రైల్వేలు, ఫార్మా, క్రీడలు, ప్రజల అనుసంధానత వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని వారు పిలుపునిచ్చారు. కొనసాగుతున్న ఆర్థిక సహకారాన్ని ఇరువురు నేతలు సమీక్షించారు. ద్వైపాక్షిక వాణిజ్యం స్థిరమైన పథంలో ఉన్నప్పటికీ, వాణిజ్య భాగస్వామ్యాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడానికి ఇరు పక్షాలూ ట్రేడ్ బాస్కెట్ వైవిధ్యీకరణకు కృషిచేయాల్సిన అవసరముందని ప్రధానమంత్రి సూచించారు. ఈ సందర్భంగా భారత్-మెర్కోసూర్ ప్రిఫరెన్షియల్ ట్రేడ్ ఒప్పంద విస్తరణ గురించి కూడా వారు చర్చించారు.

పహల్గామ్‌లో జరిగిన దారుణ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించిన అధ్యక్షుడు మిలీకి ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటంలో సంఘీభావం తెలిపిన అర్జెంటీనాను అభినందించారు. ఉగ్రవాదం మానవాళికి పెను ముప్పుగా పరిణమిస్తోందని ఇరువురు నేతలూ అభిప్రాయపడ్డారు. ఈ ముప్పుపై ప్రపంచవ్యాప్తంగా పోరాటాన్ని బలోపేతం చేయడం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలను కొనసాగించడానికి ఇరువురు నాయకులు అంగీకరించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యల గురించి గళం వినిపించాల్సిన అవసముందని వారు పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి తన పర్యటనను ముగించే ముందు, బ్యూనస్ ఎయిర్స్‌లోని మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌ల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు.

అర్జెంటీనాలో చారిత్రాత్మక పర్యటనకు విచ్చేసిన ప్రధానమంత్రికి ఆ దేశ అధ్యక్షుడు మిలీ కృతజ్ఞతలు తెలిపారు. పరస్పర అనుకూల సమయంలో భారత్‌ను సందర్శించాలని అధ్యక్షుడు మిలీని ప్రధానమంత్రి ఆహ్వానించారు.

# ప్రేమజంటకు కత్తిపోట్లు.. స్పాట్ లో ప్రియురాలు మృతి



సంగారెడ్డి, జులై 7:ప్రేమకోసం ప్రాణాలు తీయడం లేదా ఆత్మహత్యలు చేసుకోవడం వంటి ఘటనలు ఇటీవల ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఓ ప్రేమ జంట అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో ప్రియురాలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన రామచంద్రపురం పి యస్ పరిధిలోని బండ్లగూడ బాలాజీనగర్‌లో చోటుచేసుకుంది. చనిపోయిన యువతిని రమ్యగా గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న ప్రియుడు ప్రవీణ్ ను ఆస్పత్రికి తరలించారు.

మృతురాలు రమ్య డిగ్రీ చదువుతోంది. కొంతకాలంగా ఆకుల ప్రవీణ్ తో ప్రేమలో ఉన్నట్లు సమాచారం.

అయితే కొన్ని రోజులుగా ఏవో కారణాలతో ఇద్దరిమధ్య గ్యాప్ ఏర్పడ్డట్టు సమాచారం. ఈ నేపథ్యంలో యువతి ఇంట్లో గొంతుపై కత్తి గాట్లతో రక్తపు మడుగులో పడి ఉన్నారు యువతి, యువకుడు. స్పాట్ లోనే రమ్య మృతిచెందగా, అపస్మారక స్థితిలో ప్రవీణ్ ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. రమ్య మెడపై కత్తితో దాడి చేసి అనంతరం ప్రవీణ్ ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారా అని తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఆర్సీపురం పోలీసులు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కూతురు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# ట్రినిడాడ్ అండ్ టొబాగోకు ప్రధాని అధికారిక పర్యటనపై సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జులై 7:గౌరవ ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రి శ్రీమతి కమ్లా పెర్సాద్ బిసెసా ఆహ్వానం మేరకు గౌరవ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జూలై 3, 4 తేదీల్లో ఆ దేశంలో అధికారికంగా పర్యటించారు.

గత 26 ఏళ్లలో భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో చేపట్టిన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇది. ట్రినిడాడ్ అండ్ టొబాగోకు భారతీయుల వలస వెళ్లి180 ఏళ్లు (1845లో) నిండిన నేపథ్యంలో ఈ కీలక పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరుదేశాల మధ్య చిరకాల మైత్రికి ప్రాతిపదికగా నిలిచిన బలమైన నాగరికతా సంబంధాలు, ఉత్తేజకరమైన ప్రజా సంబంధాలు, ఉమ్మడి ప్రజాస్వామిక విలువలను ఈ పర్యటన మరోసారి ప్రపంచానికి చాటింది.

ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించిన ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రి కమ్లా పెర్సాద్ బిసెసాను భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఆమె చేసిన కృషిని అభినందించారు.

భారత్‌లోనూ అంతర్జాతీయ వేదికలపైనా అసాధారణ నేతృత్వానికి గుర్తింపుగా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత జాతీయ పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'ను అందించారు.

ఉమ్మడి ప్రయోజనాలున్న విస్తృతస్థాయి ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు ప్రధానులు సమగ్రంగా చర్చించారు. అన్ని రంగాల్లోనూ విస్తృత సంబంధాలపట్ల వారిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యం, ఐసీటీ, సంస్కృతి, క్రీడలు, వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, వ్యవసాయం, న్యాయం, చట్టపరమైన వ్యవహారాలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో విస్తృత, సమ్మిళిత, భవిష్యత్ దృక్పథంతో కూడిన భాగస్వామ్యాలను నెలకొల్పడంపై తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.

శాంతిభద్రతలకు ఉగ్రవాదంతో తీవ్ర ముప్పు పొంచి ఉన్నదన్న విషయమై వారిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ దానిపట్ల దృఢమైన వ్యతిరేక వైఖరిని వారు పునరుద్ఘాటించారు. సీమాంతర ఉగ్రవాదం సహా ఏ రకమైన ఉగ్రవాదాన్నీ ఉపేక్షించే ప్రసక్తే లేదని ప్రకటించారు.

ఔషధాలు, అభివృద్ధిలో సహకారం, విద్యారంగం, సాంస్కృతిక వినిమయం, దౌత్యపరమైన శిక్షణ, క్రీడల వంటి కీలక రంగాల్లో ముఖ్యమైన ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలను వారు స్వాగతించారు. 2024 నవంబరులో నిర్వహించిన రెండో భారత్ ? కారికోమ్ సదస్సు ఫలితాలను గుర్తుచేసుకుని, అందులో ప్రకటించిన కార్యక్రమాల అమలును వేగవంతం చేయడానికి కట్టుబడి ఉన్నట్టు ప్రకటించారు.

డిజిటల్ రంగంలో మరింత సహకారానికి ఇరుదేశాలూ అమితాసక్తిని కనబరిచాయి. భారత ప్రతిష్ఠాత్మక చెల్లింపుల వేదిక అయిన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)ని అమలు చేయనున్న తొలి దేశంగా ట్రినిడాడ్ అండ్ టొబాగోను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. డిజిలాకర్, ఇ-సైన్, గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్ (జీఈఎం) సహా భారత్‌కు చెందిన సాంకేతిక వేదికలను అమలు చేసే దిశగా సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని వారు నిశ్చయానికి వచ్చారు. ప్రభుత్వ భూమి నమోదు వ్యవస్థ డిజిటైజేషన్, నవీకరణలో భారత్ తోడ్పాటు అందించాలని ట్రినిడాడ్ అండ్ టొబాగో అభ్యర్థించింది. డిజిటల్ గవర్నెన్స్, ప్రభుత్వ సేవలను సమర్థంగా అందించడమన్నవి సమ్మిళిత అభివృద్ధి, ఆవిష్కరణ, జాతీయ స్థాయిలో పోటీతత్వానికి చోదకాలుగా నిలుస్తాయని నేతలిద్దరూ స్పష్టంగా పేర్కొన్నారు.

విద్యను డిజిటలీకరించాలన్న ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాన మంత్రి ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని భారత ప్రధానమంత్రి శ్రీ మోదీ కొనియాడారు. ఈ విద్యా కార్యక్రమానికి చేయూతనిచ్చేలా 2000 ల్యాప్‌టాప్‌ల బహుమతిని ప్రకటించారు. భారత ప్రభుత్వం అందించే వివిధ స్కాలర్‌షిప్ కార్యక్రమాల కింద భారత్‌లో ఉన్నత విద్య అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రధానమంత్రి మోదీ ట్రినిడాడ్ అండ్ టొబాగో విద్యార్థులకు సూచించారు.

వ్యవసాయం, ఆహార భద్రతను మరో ప్రాధాన్య రంగంగా వారు గుర్తించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో నేషనల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఏఎండీఈవీసీవో)కు ఫుడ్ ప్రాసెసింగ్, నిల్వ కోసం భారత్ 1 మిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ యంత్రాలను అందించింది. లాంఛనంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎన్ఏఎండీఈవీసోకు మొదటి బ్యాచ్ యంత్రాలను ప్రధానమంత్రి మోదీ అందించారు. ప్రకృతి వ్యవసాయం, సముద్రపు కలుపు మొక్కల ఆధారిత ఎరువులు, చిరు ధాన్యాల సాగు రంగాల్లోనూ భారత్ సాయమందిస్తుందని ప్రధానమంత్రి మోదీ హామీ ఇచ్చారు.

ఆరోగ్య సంరక్షణ విషయంలో.. ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రభుత్వం భారతీయ ఔషధాలను గుర్తించడంపై ప్రధానమంత్రి మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఔషధ రంగంలో సన్నిహిత సహకారాన్ని మెరుగుపరచడంతోపాటు ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రజలు భారత్ నుంచి తక్కువ ధరల్లో నాణ్యమైన జనరిక్ ఔషధాలను పొందే అవకాశాన్నిస్తుంది. అలాగే, భారత్‌లో వైద్య చికిత్సకూ వారికి అవకాశాన్ని అందిస్తుంది. ముమ్ముందు ట్రినిడాడ్ అండ్ టొబాగోలో 800 మంది వ్యక్తులకు కృత్రిమ అవయవాల అమరిక కోసం శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆరోగ్య సంరక్షణపరంగా సహకారం ఔషధాలు, పరికరాలకు మాత్రమే పరిమితం కాదు. ఈ విషయంలో భారత్ చేయూత పట్ల ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రి కమ్లా పెర్సాద్ బిసెసా కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత మెరుగుపరిచేలా 20 హీమోడయాలసిస్ యూనిట్లు, 2 సముద్ర అంబులెన్సులను అందించడంపట్ల భారత ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సత్వర ప్రభావాన్ని చూపే ప్రాజెక్టులపై అవగాహన ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. అభివృద్ధి దిశగా సహకారం అత్యంత ఆవశ్యకమైనదని ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాన మంత్రి పేర్కొన్నారు. భారత్ సాయంతో ట్రినిడాడ్ అండ్ టొబాగోలో సామాజిక అభివృద్ధి ప్రాజెక్టులను సకాలంలో, ప్రభావవంతంగా అమలు చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది.

కోవిడ్-19 విపత్తు క్లిష్ట సమయాల్లో విలువైన మానవ జీవితాలను కాపాడడంలో భారత్ ముందు నిలిచిందంటూ ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రి పెర్సాద్ బిసెసా ప్రశంసించారు. భారత్ సత్వర స్పందన, తమ దేశానికి కోవిడ్ వ్యాక్సిన్లు, వైద్య పరికరాల సరఫరా ఎంతో విలువైన సాయమని అభినందించారు. కోవిడ్-19 ప్రాజెక్టులో 1 మిలియన్ డాలర్ల హాల్ట్ (హై అండ్ లో టెక్నాలజీ) కింద భారత్ అందిస్తున్న సాయాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. మొబైల్ హెల్త్ కేర్ రోబోలు, టెలిమెడిసిన్ కిట్‌లు, హ్యాండ్ హైజీన్ స్టేషన్ల సరఫరా అభినందనీయమన్నారు.

విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కూటమి (సీడీఆర్ఐ), అంతర్జాతీయ జీవ ఇంధన కూటమిలో చేరాలన్న ట్రినిడాడ్ అండ్ టొబాగో నిర్ణయాన్ని భారత ప్రధానమంత్రి మోదీ స్వాగతించారు. వాతావరణ హిత కార్యాచరణ, సుస్థిరాభివృద్ధిపట్ల వారి నిబద్ధతకు ఇది నిదర్శనం. విపత్తు ప్రమాదాలను తగ్గించడం కోసం భారత్ రూపొందించిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థల్లో మరింత సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇరువురు ప్రధానులు అంగీకరించారు. విదేశాంగ, కారికోమ్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయానికి రూఫ్‌టాప్ కాంతి విద్యుత్ (పీవీ) వ్యవస్థ కోసం భారత్ గ్రాంట్ ఇవ్వడాన్ని ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రభుత్వం అభినందించింది. జాగరూకతతో కూడిన వినియోగం, పర్యావరణ హిత ధోరణులతో కూడిన జీవన శైలిని ప్రోత్సహించేలా భారత ప్రధానమంత్రి మోదీ పిలుపునిచ్చిన దార్శనిక కార్యక్రమం 'మిషన్ లైఫ్'ను ఆ దేశ ప్రధానమంత్రి పెర్సాద్ బిసెసా అభినందించారు. వాతావరణ స్పృహతో కూడిన జీవన విధానం దిశగా ప్రపంచ పౌరులను ఏకం చేయడంలో ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు.

ట్రినిడాడ్ అండ్ టొబాగోతో భారత్ భాగస్వామ్యంలో సామర్థ్యాభివృద్ధి కీలకమైన రంగంగా గుర్తించారు. వివిధ రంగాల్లో యువతలో నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఏటా 85 ఐటీఈసీ స్లాట్‌లను భారత్ అందించడాన్ని ఆ దేశ పక్షం ప్రశంసించింది. అధికారులకు పెద్ద ఎత్తున శిక్షణ కోసం నిపుణులను, శిక్షకులను ట్రినిడాడ్ అండ్ టొబాగోకు పంపించేందుకు భారత బృందం సంసిద్ధతను వ్యక్తం చేసింది.

ఫోరెన్సిక్ సైన్స్, న్యాయ వ్యవస్థల్లో అధికారులు, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో ట్రినిడాడ్ అండ్ టొబాగోకు సాయమందించడానికి ప్రధానమంత్రి మోదీ సంసిద్ధత వ్యక్తం చేశారు. శిక్షణ కోసం వారిని భారత్‌కు పంపించడం, శిక్షకులు, నిపుణులను వారి దేశానికి పంపించడం ఇందులో భాగంగా ఉంటాయి.

ఇరుదేశాల వ్యాపార సహకార సంస్థల మధ్య ప్రత్యక్ష మార్గాలను ప్రోత్సహించడం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యం, పరస్పర పెట్టుబడులను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని వారు స్పష్టం చేశారు.

రెండు దేశాల మధ్య క్రీడల్లో, ముఖ్యంగా రెండు దేశాల్లోనూ విశేష ఆదరణ ఉన్న క్రికెట్లో బలమైన సంబంధాలను పెంపొందించుకోవాలని ప్రధానులిద్దరూ నిర్ణయానికి వచ్చారు. శిక్షణ, క్రీడాకారుల వినిమయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేలా క్రీడా సహకారంపై అవగాహన ఒప్పందాన్ని వారు స్వాగతించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోలోని ఆశావహులైన యువ మహిళా క్రికెటర్లకు భారత్‌లో శిక్షణ ఇవ్వాలన్న తన ప్రతిపాదనను ప్రధానమంత్రి మోదీ పునరుద్ఘాటించారు.

ట్రినిడాడ్ అండ్ టొబాగో పండితులకు భారత్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి మోదీ ప్రకటించారు. సాంస్కృతికంగా ఇదో ప్రధానమైన ముందడుగు. భారత్‌లో జరిగే 'గీతా మహోత్సవ్'లో కూడా ఈ పండితులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంపై ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానమంత్రి కమ్లా పెర్సాద్ బిసెసా హర్షం వ్యక్తం చేశారు. అలాగే, భారత్‌లో వేడుకలతోపాటే తమ దేశంలోనూ గీతా మహోత్సవాన్ని సంయుక్తంగా నిర్వహించాలన్న భారత ప్రతిపాదనకు ఉత్సాహంగా మద్దతిచ్చారు.

సాంస్కృతిక రంగంలో సహకారానికి సంబంధించి.. ద్వైపాక్షిక 'సాంస్కృతిక వినిమయ కార్యక్రమం' ద్వారా సాధించిన పురోగతిని ఇరువురు నాయకులు గుర్తించారు. దీనిద్వారానే 1997లో మహాత్మా గాంధీ సాంస్కృతిక సహకార సంస్థ ఏర్పాటైంది. ఈ కార్యక్రమాన్ని 2025-28 కాలానికి పునరుద్ధరించేలా అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం- ఇరుదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేసేలా.. ట్రినిడాడ్ అండ్ టొబాగో వాద్య కళాకారులు (స్టీల్ పాన్), ఇతర కళాకారులను పంపిస్తుంది. దేశవ్యాప్తంగా యోగాను, హిందీ భాషను ప్రోత్సహించడంపట్ల ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రభుత్వానికి భారత ప్రధానమంత్రి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్ నుంచి యోగా శిక్షకులను పంపడానికి, ఆ దేశ పాఠ్యాంశాల్లో యోగాను చేర్చే అంశానికి మద్దతిచ్చేందుకు ఆయన ముందుకొచ్చారు.

1845లో ట్రినిడాడ్ అండ్ టొబాగోకు తొలి భారతీయ వలసకు 2025 మే 30 నాటికి 180 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని ఇద్దరు ప్రధానులు గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక పర్యాటకానికి నేల్సన్ ద్వీపం ప్రాధాన్యాన్ని వారు గుర్తించారు. భారతీయుల ఆగమనంతోపాటు జాతీయ పురా గ్రంథాలయాల్లోని ఇతర రికార్డులను డిజిటలీకరించాల్సిన అవసరం ఉందన్న భావన వ్యక్తం చేశారు. ఆ దేశంలోని భారతీయ సంతతి ప్రజల్లో ఆరో తరం వరకు ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డులను జారీ చేయాలన్న భారత ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా ప్రధానమంత్రి మోదీ ప్రకటించారు.

వెస్టిండీస్ విశ్వవిద్యాలయంలో హిందీ విద్యా పీఠాలు, భారతీయ అధ్యయనాల పునరుద్ధరణను ప్రధానులిద్దరూ స్వాగతించారు. ఇది ఇరుదేశాల మధ్య విద్య, సాంస్కృతిక సంబంధాలను మరింత పెంపొందించుకోవడానికి దోహదపడుతుంది. అంతేకాకుండా ప్రాచీన ఆయుర్వేద విజ్ఞానం, వారసత్వ వ్యాప్తినీ ప్రోత్సహిస్తుంది.

భారత్ - ట్రినిడాడ్ అండ్ టొబాగో పార్లమెంటరీ మిత్ర బృందం, ఆ దేశ పార్లమెంటు సభ్యులకు భారత్‌లో శిక్షణను పునరుద్ధరించల్సిన ఆవశ్యకతను ఇద్దరు ప్రధానులు ప్రముఖంగా పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య పార్లమెంటరీ ప్రతినిధి బృందాల పరస్పర సందర్శనలు క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన అవసరముందన్నారు.

ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరుపక్షాలు చర్చించాయి. శాంతి, వాతావరణ హిత కార్యాచరణ, సమ్మిళిత అభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న దేశాల గళాన్ని మరింత విస్తృతంగా వినిపించడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి.

# కరీంనగర్ పట్టణంలో ఇస్కాన్ మందిర నిర్మాణానికి సహకరిస్తాం - రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, జులై 7:కరీంనగర్ పట్టణంలో ప్రతిష్ఠాత్మకమైన ఇస్కాన్ మందిర నిర్మాణానికి కావలసిన సహాయ సహకారాలను అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ రోజు ఉదయం ఇస్కాన్ మందిరాన్ని సందర్శించి జగన్నాథుడి దీవెనలు పొందిన అనంతరం మాట్లాడుతూ జగన్నాథుడు కొలువైన ఇస్కాన్ మందిరం మన కరీంనగర్ పట్టణానికి ఒక ఐకాన్‌గా నిలిచే విధంగా చూస్తామని, అందరు తమ తమ స్థాయిలో చేయూతను ఇవ్వాలని అన్నారు. మందిర నిర్మాణానికి జగన్నాథుడే సరైన మార్గం చూపుతాడని, తమ వ్యక్తిగతంగా కూడా అన్ని విధాలుగా సహకరిస్తారని అన్నారు. కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ మందిర నిర్మాణానికి తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం ఇస్కాన్ పేరున మారిన వెంటనే అంతర్జాతీయ ఇస్కాన్ ట్రస్ట్ నేతృత్వంలో కనీసం 30 కోట్లను వెచ్చిస్తూ మంత్రిగారి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని ఇస్కాన్ కరీంనగర్ ఆలయ బాధ్యులు శ్రీమాన్ నరహరి ప్రభుజీ తెలిపారు. పరమ దైవ భక్తుడిగా పొన్నం ప్రభాకర్ గతంలో ఎంపీగా ఉన్నప్పుడే ఇస్కాన్ నిర్మాణానికి కృషి చేసారని, అనంతరం జరిగిన తెలంగాణ ఉద్యమంతో తన ప్రతిపాదన కొంత వెనక్కి జరిగిందని, నేడు ప్రభాకర్ గారి నేతృత్వంలోనే మందిర నిర్మాణం పూర్తి అవుతుందని జగన్నాథ రథయాత్ర కమిటీ అధ్యక్షులు కన్న కృష్ణ, డా: ఎల్ రాజభాస్కర్ రెడ్డిలు అన్నారు. ఇస్కాన్ మందిర నిర్మాణం పొన్నం ప్రభాకర్ గారి చొరవతో జరుగుతుందని, దానికి భక్తుల పక్షాన మంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇస్కాన్ మందిరంలో కొలువైన జగన్నాథుడు, రాధా గోవిందులకు పూజలు చేసి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా నరహరి ప్రభుజీ ఆలయం పక్షాన పొన్నం ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించి ప్రసాదం అందజేశారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో ఒక ఉసిరి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ సహకార సంఘం చైర్మన్ పిట్టల రవి, కాంగ్రెస్ నాయకులు విలాస్ రెడ్డి, పద్మాకర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్ తదితరులను మందిర బాధ్యులు సన్మానించి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీమాన్ నరహరి ప్రభుజీ, కన్న కృష్ణ, ఎల్ రాజభాస్కర్ రెడ్డిలతో పాటు తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్: డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, రాళ్లబండి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బ్రెజిల్ లోని రియో డి జెనీరోలో జరుగుతున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న ప్రధాని

న్యూఢిల్లీ, జులై 7:బ్రెజిల్ లోని రియో డి జెనీరోలో జరుగుతున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పాల్గొన్నారు. నిన్న ప్రారంభమైన ఈ సదస్సు ఈరోజు కూడా జరుగుతోంది. అంతర్జాతీయ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్ వాణిని విస్తరించడం, శాంతి భద్రతలు, బహుపాక్షిక విధానాన్ని బలోపేతం చేయడం, అభివృద్ధి సమస్యలు, కృత్రిమ మేధతో సహా బ్రిక్స్ అజెండాకు సంబంధించిన వివిధ అంశాలపై నాయకులు ఫలప్రదమైన చర్చలు జరిపారు. సదస్సును విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఆత్మీయ ఆతిథ్యమిచ్చిన బ్రెజిల్ అధ్యక్షునికి ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

"అంతర్జాతీయ పాలనలో సంస్కరణ, శాంతి భద్రతలు" అనే అంశంపై నిర్వహించిన ప్రారంభ సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. అనంతరం "బహుపాక్షిక ఆర్థిక-రుణ సంబంధ వ్యవహారాలు, కృత్రిమ మేధను బలోపేతం చేయడం" అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బ్రిక్స్ సభ్య, ఆహ్వానిత దేశాలు పాల్గొన్నాయి.

అంతర్జాతీయ పాలన, శాంతిభద్రతలపై నిర్వహించిన కార్యక్రమంలో గ్లోబల్ సౌత్ వాణిని బలంగా వినిపించడంలో భారత్ నిబద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. పర్యావరణ పరిరక్షణకు ఆర్థిక సాయం, సాంకేతికత పరిజ్ఞానం అందుబాటులో ఉండటం పరంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సుస్థిరాభివృద్ధికి మరింత తోడ్పాటు అవసరమని తెలిపారు. 20 వ శతాబ్దంలో ఏర్పాటైన అంతర్జాతీయ సంస్థలు 21వ శతాబ్దపు సవాళ్లను పరిష్కరించడంలో వెనకబడి ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని సంస్కరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బహుళధ్రువ, సమ్మిళిత ప్రపంచ వ్యవస్థల అవసరాన్ని తెలియజేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యూటీవో లాంటి సంస్థలను వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా తక్షణమే సంస్కరించాలన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో తక్షణమే సంస్కరణలు తీసుకురావాలని స్పష్టం చేసినందుకు, దీనికి సంబంధించిన ప్రకటనలో బలమైన వాదన వినిపించినందుకు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

శాంతి భద్రతల గురించి మాట్లాడుతూ.. మానవాళికి ఉగ్రవాదం పెనుముప్పుగా మారిందని అన్నారు. ఈ సందర్భంగా 2025 ఏప్రిల్లో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి ప్రస్తావించారు. ఇది కేవలం భారత్ పైనే కాకుండా, యావత్ మానవాళిపై జరిగిన దాడిగా వర్ణించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బలమైన అంతర్జాతీయ చర్యలకు పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే, ప్రోత్సహించే లేదా వాటికి సురక్షిత స్థావరాలను అందించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలను అనుసరించకూడదని స్పష్టం చేశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న అంతర్జాతీయ పోరాటాన్ని బలోపేతం చేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. ఈ ముప్పును ఉపేక్షించకుండా ఎదుర్కోవాలన్నారు.

ఈ అంశంపై మరింత వివరిస్తూ.. పశ్చిమాసియా నుంచి ఐరోపా వరకు కొనసాగుతున్న ఘర్షణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవడానికి భారత్ ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తుందని, ఈ ప్రయత్నాలకు సహకరించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

"బహుపాక్షిక ఆర్థిక-రుణ సంబంధ వ్యవహారాలు, కృత్రిమ మేధను బలోపేతం చేయడం" అనే అంశంపై జరిగిన సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. భిన్నత్వం, బహుళ ధ్రువత్వమే బ్రిక్స్ విలువైన ఆస్తులని పేర్కొన్నారు. ప్రపంచ ఒత్తిడిని, అంతర్జాతీయ సమాజం అనిశ్చితిని, సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో బ్రిక్స్ అవసరం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. బహుళధ్రువ ప్రపంచాన్ని ఏర్పాటు చేయడంలో బ్రిక్స్ కీలపాత్ర పోషించగలదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన నాలుగు సూచనలు చేశారు:

ప్రాజెక్టులను మంజూరు చేయడంలో డిమాండ్ ఆధారిత సూత్రాన్ని, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని బ్రిక్స్ నూతన అభివృద్ధి బ్యాంకు పరిగణనలోకి తీసుకోవాలి.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రయోజనం చేకూర్చే సైన్స్, పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

కీలకమైన ఖనిజాల సరఫరా వ్యవస్థను సురక్షితంగా, స్థిరంగా మార్చడంపై దృష్టి సారించాలి.

పాలనలో ఏఐ వల్ల ఎదురయ్యే సమస్యలను పరిగణన లోనికి తీసుకొని బాధ్యతాయుతమైన ఏఐపై దృష్టి సారించాలి. ఈరంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి అంతే ప్రాధాన్యమివ్వాలి. నాయకుల సమావేశం ముగింపులో సభ్యదేశాలు 'రియో డి జెనీరో ప్రకటన'ను ఆమోదించాయి.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం -ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హైదరాబాద్, జులై 7: రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను చేపడుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం చేగూరు గ్రామంలో పిఏసిఎస్ చైర్మన్ అశోక్ ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సొసైటీ భవన నిర్మాణ పనులకు సోమవారం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డిసిసిబి చైర్మన్ మామిళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సేవలందించేందుకు గతంలో ఏర్పాటు చేసిన సొసైటీలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, రైతులకు కావాల్సిన రుణాలు, ఎరువులు, విత్తనాలు అన్ని విధాలుగా తక్కువ వడ్డీతో సొసైటీల ద్వారా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రైతులు ఇతర ప్రైవేటు బ్యాంకులను నమ్మకుండా సొసైటీల ద్వారా లబ్ధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్లు బక్కన్న యాదవ్, దామోదర్ రెడ్డి, వైస్ చైర్మన్ పద్మారావు, డైరెక్టర్లు, సిఈఓ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగ నరసింహ, మాజీ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, కుమారస్వామి గౌడ్, చంద్రపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు కావలి కృష్ణ, జట్ట కుమార్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల్లో కెళ్ళి పథకాల గురించి అవగాహన కల్పించాలి : వెడ్మ బొజ్జు పటేల్



జన్నారం, జులై 7 : గ్రామస్థాయిలో ప్రజల్లో కెళ్ళి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల, నిర్మల్ జిల్లాలోని జన్నారం దస్తురాబాద్ మండలాల్లోని ముఖ్య నేతల, కార్యకర్తల సమావేశం సోమవారం మధ్యాహ్నం స్థానిక ఆర్అర్ఎన్ బంకటాల్లో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున చేపట్టిన పథకాలను కార్యకర్తలు ఇంటింటి తిరుగుతూ క్లుప్తంగా వివరించాలన్నారు. ఒక్క నిర్ణీత ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలని ఆయన సూచించారు. వచ్చే నెలలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల ఎన్నికలు నిర్వహించనున్నందున సన్నద్ధం కావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కష్టపడుతూ కృషి చేయాలని ఆయన తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికే పదవులు వరిస్తాయని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్, వైస్ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ,పొనకల్ సింగల్ విండో చైర్మన్ అల్లం రవి,పాండ్వాపూర్ సింగల్ విండో చైర్మన్ ఆర్. శైలజ రమేష్ రావు, పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ముజఫర్, మల్లేష్, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మకు హాజరైన డాక్టర్ బండి కుమార్



ఖమ్మం, జులై 7:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ నందు జర్నలిస్టు మిత్రుడు నమస్తే తెలంగాణ ఫోటోగ్రాఫర్ బండారి మహేష్ మాతృమూర్తి బండారి రమణ దశదినకర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్, నమస్తే తెలంగాణ పత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఛీఫ్ మాటేటి వేణు, వెలుగు దినపత్రిక ఫోటోగ్రాఫర్ రవి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వ్యక్తిగత సహాయకులు సిహెచ్.కిరణ్ కుమార్, కాంగ్రెస్ నేత చింతనిప్పు కృష్ణ చైతన్య, బిఆర్ఎస్ కార్పొరేటర్ బుర్రి వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ నాయకులు బుర్రి వినయ్, తదితరులున్నారు.

# ఐసెట్ ఫలితాల్లో నల్లగొండ వాసి శ్రీనివాస్‌గౌడ్‌కు 8వ ర్యాంక్

నల్గొండ, జులై 7: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ ఐసెట్-2025 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, ఐసెట్ చైర్మన్, ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్, ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవితో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 38,754 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 32,106 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 30,944 మంది ఉత్తీర్ణతతో ర్యాంక్‌లు సాధించినట్లు వెల్లడించారు. ఫలితాల విడుదలలో టీఎస్ ఐసెట్ కో కన్వీనర్, ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మిర్యాల రమేశ్‌కుమార్, ఉన్నతవిద్యా మండలి కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

నల్లగొండ వాసి శ్రీనివాస్ గౌడ్‌కు 8వ ర్యాంక్

నల్లగొండలోని పరీక్ష కేంద్రంలో 505 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 448 మంది క్వాలిపై (ఉత్తీర్ణత) సాధించారు. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెంది వడ్డెపల్లి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్రంలో 8వ (148.17 మార్కులు) ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. ఉత్తమ ర్యాంక్ సాధించిన శ్రీనివాస్‌గౌడ్‌కు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అధ్యాపక బృందం, మిత్రులు అభినందనలు తెలిపారు.

# సింగరేణి సంస్థవల్ల నష్టపోయిన రైతు సుందర్ లాల్



ఖమ్మం, జులై 7:(నేటినిజం ప్రతినిధి): సింగరేణి సంస్థ వల్ల నష్టపోయిన రైతు సుందర్ లాల్ లోదు తన ఎడ్ల బండితో ఇసుక, ఇటుక, మట్టి అమ్ముకుంటూ తన భూమిని సింగరేణి సంస్థ తీసుకొని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదని ఎడ్ల బండి పైన ఫ్లెక్సీ కొట్టించి నిరసన తెలిపేవాడు ఇదే క్రమంలో ఒకరోజు తన ఎడ్ల బండి జిఎం ఆఫీస్ ఎదురుగా పూసపల్లి పోయే రూట్ లో వెళ్తుండగా ఎస్ఎంపిసి వాళ్ళు ఆపి తన ఎడ్ల బండి లాక్కోవడంతో ఈ విషయం తెలుసుకున్న తన కొడుకు సంజయ్ మా భూమిని తీసుకున్నారు, మాకు జీవనాధారమైనటువంటి ఎడ్ల బండిని గుంజుకున్నారు, ఎంతోమంది ఆఫీసు చుట్టూ తిరిగిన న్యాయం చేస్తానని చెప్పి చెయ్యకపోవడంతో మనస్తాపానికి గురై ఈ భారతదేశమే నాకు వద్దు అని సైకిల్ మీద నేపాల్ వెళ్ళిపోతాను అని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటూ వెళ్లిపోవడం జరిగింది, ఇదే క్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మీకు న్యాయం చేస్తాను అని హామీ ఇచ్చారు, హామీ ఇవ్వడమే కాకుండా సింగరేణి జిఎంతోను కారేపల్లి ఎంఆర్ఓ తోని మాట్లాడి కొంత భూమిని ఇచ్చారు సుందర్ లాల్ కొడుకు సంజయ్ ని మీకు న్యాయం జరిగింది తిరిగి ఇంటికి రమ్మని చెప్పడంతో నేపాల్ వెళ్లిపోయిన తన కొడుకు సంజయ్ తిరిగి ఇంటికి వచ్చేసాడు ఇదే క్రమంలో 07-04-2024 రోజున నష్టపరిహారం కింద సుందర్ లాల్ రైతుకి ఇచ్చిన భూమిని టాక్టర్ తో దున్నుతుండగా సింగరేణిలో పనిచేసే ఎస్ఎన్పిసి వాళ్ళు వచ్చి మీకు ఈ భూమి ఇవ్వలేదు మీరు దున్నడం ఆపేయాలి ఇక్కడ నుండి వెళ్లిపోమని చెప్పారు, మీకు ఎమ్మెల్యే ఎటువంటి న్యాయం చేయలేదు నిన్ను నేపాల్ నుంచి రప్పించడానికి అబద్ధం చెప్పారని ఎస్ఎన్పిసి వాళ్ళు చెప్పడం జరిగింది. ఇదే విషయాన్ని తెలియజేయడానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య దగ్గరికి సుందర్ లాల్ తన కుటుంబంతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ దగ్గరికి వెళితే ఎమ్మెల్యే లేరు హైదరాబాద్ వెళ్లారని అక్కడ ఉన్న కార్యకర్తలు చెప్పడం జరిగింది.

# నాట్ల కోసం కేసీఆర్ రైతు బంధు ఇస్తే.. కాంగ్రెస్ ఓట్ల కోసం రైతు భరోసా ఇచ్చింది : సత్యవతి రాథోడ్



మహబూబాబాద్,జులై 7:నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు నాట్లు వేసుకునే సమయంలో రైతుబంధు ఇచ్చి ఆదుకుంటే..ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ఓట్లను దృష్టిలో పెట్టుకుని రైతు భరోసా నిధులను వేసిందని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. 18 నెలలుగా మాటలకే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో మోకాలి శస్త్ర చికిత్స అనంతరం సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అసమర్థ ముఖ్యమంత్రిని, పాలనపై పట్టులేని మంత్రులను, వారి వప్రజలను మాటలతో మోసం చేస్తున్న పాలకులకు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన ప్రజాప్రతినిధులు ఒక్క అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ సగం మందికి కూడా చేయలేదని, రైతు బంధు ఎగ్గొట్టారని ఆరోపించారు. కేసీఆర్ రైతులకు రెండు పంటలకు టంచనుగా రైతు బంధు జమచేశారని గుర్తు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఏడాదిన్నర కాలంలో ఎంతమందికి రైతు బంధు జమచేశారని, వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మహబూబాద్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిపై మంత్రి, ఎమ్మెల్యేలు సమీక్ష చేయడంలేదన్నారు.

మహబూబాబాద్ జిల్లా అనాథగా మారిందని, పట్టించుకున్న నాధుడే కరువయ్యారని విమర్శించారు. 3500 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గొప్పలు చెబుతున్నారని, కురవి మండలంలో మోడల్ గ్రామంగా ఎంపికైన కొత్తూరు (జీ) గ్రామంలో ఎంతమందికి అర్హులకు ఇచ్చారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట కాంగ్రెస్ పార్టీ నాయకులు అవినీతికి తెరలేపారన్నారు. సాగునీటి కోసం బీఆర్ఎస్ మరో యుద్ధం చేయనుందని, మరోవారం రోజుల పాటు ప్రభుత్వానికి అవకాశం ఇచ్చామని అన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టుల గేట్లు ఎత్తి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి కదం తొక్కుతారన్నారు. అలాగే కేసీఆర్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించమని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, నూతక్కి నర్సింహారావు, గుగులోతు రవి నాయక్, గుగులోత్ పద్మ, బోడ శ్రీను, అల్లూరి కిషోర్ వర్మ, బాదె నాగయ్య, యానాల గంగాధర్ రెడ్డి, కిన్నెర మల్లయ్య, బిక్షం రెడ్డి, చిన్నం భాస్కర్, దిడ్డి శ్రీను, బొజ్యా నాయక్, రాజు నాయక్, గుండెబోయిన సూరయ్య, కళ్లెపు శ్రీను, అర్జున్ చౌహాన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రియింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి.. ఎస్ఎఫ్ఐ

ఖమ్మం, జులై 7: రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం చేపట్టి 18 నెలలు గడుస్తున్న విద్యారంగాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని, విద్యార్థులకు రావాల్సిన రూ.8వేల కోట్ల బకాయి బిల్లులు, ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ నిధులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంత్ డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట పెండింగ్ స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా చేపట్టారు. విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాకపోయే సరికి విద్యా సంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రుల నుండి ముక్కు పిండి బకాయి బిల్లులు వసూలు చేస్తున్నాయని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గుర్తించి పెండింగ్ స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరవింద్, నరేష్, అభిరామ్, అభివర్ధన్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని వినతిపత్రం అందజేత



మహబూబ్‌నగర్, జులై 7: నారాయణపేట జిల్లా ఊట్కూర్ చెక్‌పోస్టు సమీపంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికటాలని ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ఖాజీమ్ హుస్సేన్, నారాయణపేట పట్టణ అధ్యక్షుడు సాజిద్ సిద్ధికీ డిమాండ్ చేశారు. ఆర్అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణకు సోమవారం వినతి పత్రం అంద జేశారు.

ఊట్కూర్ మండల కేంద్రం నుంచి మక్తల్, నారాయణపేట పట్టణాలకు వెళ్లే క్రమంలో చెక్ పోస్ట్ మలుపుల వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేయకపోవడంతో వాహనాచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సందర్భాలలో చెక్‌పోస్టు క్రాస్ రోడ్డులో వాహనాలు ఢీకొట్టుకుని యువకులు మృతి చెందిన సంఘటనలున్నాయని వివరించారు. స్పందించిన ఈఈ విచారణ చేపట్టి స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం : ఏ.విష్ణు

మధిర, జులై 07 : ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకమని మధిర ఉద్యానవన శాఖ అధికారి ఏ.విష్ణు, మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్ అన్నారు. సోమవారం మధిర మండలంలోని సిద్దినేనిగూడెం గ్రామంలో రైతు సురంశెట్టి కిశోర్ భూమిలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ పంట లాభదాయకమన్నారు. ఒకసారి నాటితే 30 సంవత్సరాల వరకు ఆదాయాన్ని ఇచ్చే పంట అన్నారు. కోతుల నుండి ప్రకృతి వైపరీత్యాల నుండి హాని లేని పంట అన్నారు. చీడ పీడలు తక్కువగా ఆశించే పంట అని, మార్కెటింగ్ సౌకర్యం ఉన్న పంట అని వివరించారు.

ప్రభుత్వం రూ.200 విలువ గల మొక్కని రాయితీ మీద రూ.20కే ఇస్తున్నట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చుల కింద ప్రతి ఏడాది ఎకరాకు రూ.4,200 చొప్పున అందజేస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుకు ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలు, చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ విధంగా, ఆయిల్‌పామ్ మొక్కలకు, తోట నిర్వహణ ఖర్చులకు నాలుగు సంవత్సరాల వరకు, డ్రిప్ ఇరిగేషన్‌కు ఒక ఎకరానికి రూ.50,918 ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

# నెక్కొండలో విషాదం.. రైలు ఢీకొని 30 గొర్రెలు మృతి



వరంగల్, జులై 7:పేదరికం అధిగమించేందుకు గొర్రెలను కొనుగోలు చేసి వాటి ద్వారా జీవనోపాధి పొందాలని ఆశించిన ఓ నిరుపేద కుటుంబం ఒక్కసారిగా తీవ్ర విషాదంలోకి నెట్టివేయబడింది. నెక్కొండ మండలంలోని పెద్ద కొర్పోలు గ్రామానికి చెందిన ఆలకుంట శ్రీనివాస్ కు చెందిన 30 గొర్రెలు సోమవారం మధ్యాహ్నం గూడ్స్ రైలు కిందపడి మృత్యు వాతపడ్డాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలకుంట శ్రీనివాస్ కూలినాలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూలీ పనులకు వెళ్తూ జీవన సాగిస్తున్న ఆ కుటుంబం రెండేళ్ల కిందట అప్పుచేసి చేసి గొర్రెలను కొనుగోలు చేశాడు.

రోజు మాదిరిగానే గొర్రెలను మేపడానికి గ్రామశివారులోకి శ్రీనివాస్ కుమారుడు సాయి కిరణ్ గొర్రెలను తీసుకువెళ్లాడు. గొర్రెలు మేత మేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుక్కల గుంపు గొర్రెల పైకి దాడిగి దిగడంతో దగ్గరలోని రైల్వే ట్రాక్ పైకి 30 గొర్రెలు పరిగెత్తాయి. ఇదే సమయంలో డౌన్ ట్రాక్ లో కాజీపేట నుంచి విజయవాడ వైపు వెళ్లే గూడ్స్ రైలు 30 గొర్రెలను ఢీకొట్టడం గొర్రెలన్నీ మృత్యువాత పడ్డాయి. మృత్యువాత పడిన గొర్రెల విలువ మూడు నాలుగు లక్షలు ఉంటాయని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం: తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, జులై 7:పారిశుధ్య నిర్వహణలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకలకమైనదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ కిట్‌లను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించగలరని అన్నారు. కార్మికులు పారిశుధ్య విధుల నిర్వహణతో పాటు తమ ఆరోగ్యం పట్ల కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా చెత్త, వ్యర్థాలు రోడ్లపై వేయకుండా పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు.

# టారిఫ్‌ల విషయంలో కఠిన వైఖరి అవలంభిస్తోన్న ట్రంప్

## –బ్రిక్స్ అనుకూల దేశాలపై 10 శాతం అదనపు టారిఫ్‌లు..

వాషింగ్టన్ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);టారిఫ్‌ల విషయంలో కఠిన వైఖరి అవలంభిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక ప్రకటన చేశారు. బ్రిక్స్ సదస్సు వేళ కీలక హెచ్చరికలు చేశారు. బ్రిక్స్ అనుకూల దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు తప్పవని హెచ్చరించారు. బ్రిక్స్ దేశాలు అమెరికా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్టు పెట్టారు. 'అమెరికా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బ్రిక్స్ అనుకూలంగా ఉన్న ఏదేశానికైనా అదనంగా 10 శాతం సుంకాలు విధిస్తాం. ఇందులో ఎలాంటి మినహాయింపులూ ఉండవు' అని ట్రంప్ తన పోస్టులో రాసుకొచ్చారు. బ్రెజిల్ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు వేళ ట్రంప్ నుంచి ఈ హెచ్చరికలు రావడం సంచలనం గా మారింది.బ్రెజిల్‌లోని రియో డీ జెనీరలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్ర దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించా యి. ఉగ్రదాడులు ఎక్కడ జరిగినా ముక్త కంఠంతో ఖండిస్తున్నామని, టెర్రరిజం ఏ రూపంలో ఉన్న వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'రియో డీ జెనీరో డిక్లరేషన్'ను సభ్యదేశాలు విడుదల చేశాయి.'ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తున్నాం. క్రాస్ బార్డర్ టెర్రరిజంతోపాటు ఉగ్రమూకలకు నిధులు అందిస్తూ, ఆశ్రయం కల్పించడాన్ని ఖండిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో కలిసికట్టుగా ముందుకు వెళ్తాం. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని అందులో పేర్కొన్నాయి. అయితే ఈ తీర్మానంలో ఎక్కడా పాకిస్థాన్ పేరు ప్రస్తావించలేదు.

# ఆస్తి పంపకాలు... వీలునామా

## –ఏ ఆస్తి ఎవరికి.. వీలునామా లేకపోతే పంపకాలెలా..

హైదరాబాద్ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తల్లిదండ్రులందరూ తమ పిల్లల కోసమే ఆస్తుల్ని కూడబెడతారు. అయితే చాలామంది తమ మరణానంతరం ఆస్తి పంపకాలు ఎలా జరగాలి అన్నది వివరిస్తూ వీలునామాను రాస్తారు. ఇలాంటప్పుడు ఏ పేచీ ఉండదు. ముఖ్యంగా కుటుంబంలో ఎలాంటి గొడవలకు తావుండదు. వారసులకు ఆస్తుల పంపిణీ దాదాపు సజావుగానే సాగుతుంది. ఇంకొందరు తాము బ్రతికి ఉండగానే ఆస్తుల్ని పిల్లలకు పంచి ఇచ్చి, వారివారి ఇష్టప్రకారం వాళ్ల వద్దే శేష జీవితం కానీ కొందరు వీలునామా రాయకుండానే చనిపోతారు. అలాంటప్పుడు ఆస్తుల పంపకాలు ఎలా.. కొడుకులు, కూతుళ్లకు ఏ ఆస్తిని ఎలా విభజిస్తారు.. అన్నది ప్రశ్న. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే కూతుర్లుసహా వారసులందరికీ పెండ్లిళ్లు అయినా, కాకపోయినా తల్లిదండ్రుల స్వార్జితంలో చట్టప్రకారం వాటా ఉంటుంది .హిందూ వారసత్వ సవరణ చట్టం 2005 ప్రకారం తల్లిదండ్రుల సంపాదనలో కొడుకులతో సమానంగా కూమార్తెలకూ భాగం వస్తుంది.వీలునామా లేకపోతే హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆస్తులకు సంతానాన్ని తొలి ప్రాధాన్యతగా పరిగణిస్తారు. చట్టబద్ధమైన వారసులందరికీ సమానంగానే వాటాను పంచుతారు.వీలునామా ఉంటే, ఆస్తి తమ కష్టార్జితమే అయితే తల్లిదండ్రులు ఎవరికైనా ఇచ్చేయవచ్చు. పిల్లలెవరూ ఎలాంటి అభ్యంతరాలను వ్యక్తం చేయలేరు.ఒకవేళ తాత, ముత్తాతల నుంచి వచ్చిన వారసత్వ సంపద అయితే తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వారసులందరికీ సమాన వాటాలుంటాయి.ఒక వ్యక్తి ఒకటికి మించి ఎక్కువ పెండ్లిళ్లు చేసుకుంటే ఆ వ్యక్తికి వారసత్వంగా వచ్చిన ఆస్తులపై తన ద్వారా జన్మించిన ప్రతీ ఒక్కరికి హక్కు ఉంటుంది.

# ఆరోగ్య ప్రదాయిని బోడకాకర కాయలు



హైదరాబాద్ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మీద చిన్నపాటి బుడిపెలతో చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అవేనండీ.. బోడకాకర కాయలు. కొన్ని ప్రాంతాల్లో వీటిని అడవి కాకర అని, కొందరు ఆగాకర కాయలు అని కూడా పిలుస్తారు. ఇవి కేవలం వర్షాకాలం సీజన్‌లోనే వస్తాయి. అయితే ఈ సీజన్‌లో వచ్చే ఈ కాయలను చాలా మంది ఇష్టంగా తింటారు. వీటితో వేపుడు, పులుసు, టమాటా కూర చేసుకుని తినవచ్చు. ఎంతో రుచిగా ఉంటాయి. అయితే బోడ కాకరకాయలు మనకు ఎన్నో పోషకాలతోపాటు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను కూడా అందిస్తాయి. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. కనుక ఈ సీజన్‌లో లభించే ఈ కాయలను విడిచి పెట్టకుండా తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. బోడ కాకరకాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని వారు అంటున్నారు.

రోగ నిరోధక శక్తికి..

100 గ్రాముల బోడ కాకరకాయలను తినడం వల్ల సుమారుగా 30 క్యాలరీల మేర శక్తి లభిస్తుంది. ఈ కాయల్లో 80 శాతం నీరు ఉంటుంది. ప్రొటీన్లు 3 గ్రాములు, ఫైబర్ 3 గ్రాములు, విటమిన్లు సి, ఎ, బి1, బి2, బి3, బి9, పొటాషియం, ఐరన్, క్యాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్, జింక్, మాంగనీస్ వంటి పోషకాలు ఈ కాయల్లో అధికంగా ఉంటాయి. ఫైటో న్యూట్రియెంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు సైతం వీటిల్లో అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ కాయలను తింటే ఎంతో మేలు జరుగుతుంది. బోడకాకర కాయలలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక ఈ కాయలను తింటే శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఈ కాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక వ్యవస్థ కణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధుల నుంచి బయట పడవచ్చు.

అల్సర్లు, పైల్స్ ఉంటే..

బోడకాకర కాయలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక ఈ కాయలను తింటే సులభంగా జీర్ణం అవడమే కాదు, వీటిల్లో ఉండే లాక్సేటివ్ గుణాల కారణంగా ఈ కాయలు మలబద్దకాన్ని తగ్గిస్తాయి. సుఖ విరేచనం అయ్యేలా చేస్తాయి. ఈ కాయలన తినడం వల్ల అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ముఖ్యంగా జీర్ణాశయ అల్సర్లు, పైల్స్ ఉన్నవారికి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. బోడకాకర కాయల గ్లైసిమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ కాయలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా ఈ కాయల్లో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. కనుక సాధారణ కాకరకాయ మాదిరిగానే ఈ కాయలు కూడా షుగర్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి. చేదు ఉండవు కనుక ఇష్టంగా తినవచ్చు. షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు.

గుండె ఆరోగ్యానికి..

బోడకాకర కాయలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న కారణంగా శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఈ కాయలు ఎంతో మేలు చేస్తాయి. బరువు తగ్గాలనుకునే వారు ఈ కాయలను తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. వీటిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పైగా ఈ కాయల్లో ఫైబర్ ఉంటుంది కనుక వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఈ కాయల్లో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా ఈ సీజన్‌లో లభించే బోడకాకర కాయలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు

# ప్రపంచవ్యాప్తంగా వేడెక్కుతున్న వాతావరణం

## –ఇది కేవలం వాతావరణ సంక్షోభం మాత్రమే కాకుండా మానవ ఆహార సంక్షోభానికి దారి తీస్తుంది
## – గ్లోబల్ వార్మింగ్‌తో ప్రపంచం ఓ పూట భోజనం మానేయాల్సిందే..!
## –తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు..!

న్యూ డిల్లీ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రపంచవ్యాప్తంగా వాతావరణం వేడెక్కుతున్నది. ఇది కేవలం వాతావరణ సంక్షోభం మాత్రమే కాకుండా మానవ ఆహార సంక్షోభానికి దారి తీస్తుందని తాజా అధ్యయనం హెచ్చరికలు చేస్తున్నది. ప్రపంచ ఉష్ణోగ్రతలు ఒక్క డిగ్రీ సెల్సియస్ పెరిగినా.. ఒక్కో వ్యక్తికి ప్రతిరోజూ లభించే ఆహారంలో సగటున 120 క్యాలరీలు తగ్గిపోతాయట. ఇది మన రోజువారీ ఆహార వినియోగంలో సుమారు 4.4శాతం తక్కువ. ప్రఖ్యాత అంతర్జాతీయ జర్నల్ 'నేచర్'లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం.. శతాబ్దం చివరినాటికి ప్రధాన పంటల నుంచి వచ్చే క్యాలరీల పరంగా 24 శాతం వరకు తగ్గిపోవచ్చని హెచ్చరిస్తున్నది. ఇది ఇప్పటికే ఆకలితో బాధపడుతున్న కోట్లాది మంది ప్రజల పరిస్థితిని మరింత దయనీయంగా మార్చనున్నదని నివేదిక ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రతి ఒక్కరికీ హెచ్చరికే..స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీతో సహా ప్రపంచంలోనే ప్రఖ్యాత సంస్థలుకలిసి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. అధ్యయనం ప్రధాన పరిశోధకుడు ప్రొఫెసర్ సోలమన్ హ్సియాంగ్ మాట్లాడుతూ.. 'ఉష్ణోగ్రత మూడు డిగ్రీలు పెరిగితే.. ప్రపంచం మొత్తం ఉదయం భోజనం మానేసినట్టే అవుతుంది' అన్నారు. ఈ ప్రభావం అత్యధికంగా తక్కువ ఆదాయ గల దేశాలపై ఉండనుందని, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇప్పటికే ఉన్న పోషకాహార లోపం మరింత తీవ్రతరమవుతుందని హెచ్చరించారు. ఈ ప్రభావం అత్యధికంగా పేదలపై ఉంటుందని.. ఇప్పటికే 80కోట్ల మంది పోషకాహారం లోపంతో బాధపడుతుండగా.. వారి పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అధ్యయనం కేవలం శాస్త్రవేత్తలు, పాలసీ మేకర్లకే కాకుండా ప్రతిరోజూ రెండుపూటలా భోజనం చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ హెచ్చరికలాంటిదన్నారు.

వాతావరణ మార్పులతో..

ప్రస్తుతం మొక్కజొన్న, సోయాబిన్ ఉత్పత్తికి కేంద్రంగా ఉన్న అమెరికా మిడ్‌వెస్ట్ భవిష్యత్‌లో అత్యంత ప్రభావితమైన ప్రాంతాల్లో ఒకటిగా ఉండనుందని అధ్యయనం పేర్కొంది. వాతావరణ మార్పు ఉష్ణోగ్రతలో తీవ్ర పెరుగుదల, వర్షపాత నమూనాలలో అస్థిరత, వేడిగాలుల ఫ్రీక్వెన్సీ పెరుగుదలకు కారణమవుతుందని భావిస్తున్నారు. దాని కారణంగా నేల తేమ తగ్గుతుంది. పరాగసంపర్కం ప్రక్రియ దెబ్బతింటుంది. పంటలు ముందుగానే వాలిపోవడం లేదంటే ఎండిపోవడం జరుగుతుంది. అదే సమయంలో కెనడా, రష్యా, చైనా వంటి చల్లని దేశాలలో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఇప్పటికే చర్యలు తీసుకోకపోతే..

2025 నాటికే ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా పంట ఉత్పత్తి 8 శాతం వరకు తగ్గిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇది కార్బన్ ఎమిషన్లు తగ్గినా.. పెరిగినా ఇదే జరుగుతుందని చెబుతున్నారు. ఎందుకంటే కార్బన్ డై ఆక్సైడ్ వంటి హానికర వాయువులు వందల ఏళ్ల పాటు వాతావరణంలో ఉండడమే కారణం. వాతావరణ అనుకూల వ్యవసాయ సాంకేతికత, నిధులు సమకూర్చడం, ప్రభుత్వ సహాయంతో రైతులకు మద్దతు ఇచ్చినట్లయితే ఈ నష్టాన్ని కొంత మేరకైనా తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఇది సాధ్యపడాలంటే ప్రపంచవ్యాప్తంగా స్థాయిలో పాలసీ తీసుకురావడంతో పాటు తక్షణ చర్యలు, కఠిన నిర్ణయాలు అవసరమని నిపుణులు స్పష్టం చేశారు.

# ఏది నిజం.. క్రెడిట్ కార్డులపై ఈ అపోహలు వద్దు

## –వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నా అపోహలు..
## –నగదు అవసరాల్లో క్రెడిట్ కార్డులు కొంత వెసులుబాటు

హైదరాబాద్ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏది నిజం.. క్రెడిట్ కార్డులపై ఈ అపోహలు వద్దు నగదు అవసరాల్లో క్రెడిట్ కార్డులు కొంత వెసులుబాటును, మరికొంత సౌకర్యాన్నిస్తాయి. అయితే వీటిపై నెలకొన్న కొన్ని అపోహలు.. వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఫలితంగా అవి వారి ఆర్థిక సామర్థ్యాన్నీ దెబ్బతీస్తున్నాయి. నిజానికి డిజిటల్ ఫైనాన్స్ నానాటికీ విస్తృతంగా విస్తరిస్తున్న నేపథ్యంలో క్రెడిట్ కార్డులపై పేరుకుపోయిన అపోహలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరి నిపుణులు ఏం చెప్తున్నారు?

ఏది నిజం.. క్రెడిట్ కార్డులపై ఈ అపోహలు వద్దు

నగదు అవసరాల్లో క్రెడిట్ కార్డులు కొంత వెసులుబాటును, మరికొంత సౌకర్యాన్నిస్తాయి. అయితే వీటిపై నెలకొన్న కొన్ని అపోహలు.. వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఫలితంగా అవి వారి ఆర్థిక సామర్థ్యాన్నీ దెబ్బతీస్తున్నాయి. నిజానికి డిజిటల్ ఫైనాన్స్ నానాటికీ విస్తృతంగా విస్తరిస్తున్న నేపథ్యంలో క్రెడిట్ కార్డులపై పేరుకుపోయిన అపోహలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరి నిపుణులు ఏం చెప్తున్నారు?

మినిమం పేమెంట్స్‌పై క్రెడిట్ కార్డుపైనున్న బకాయిని పూర్తిగా చెల్లించకుండా మినిమం పేమెంట్స్ లేదా దానిపై వడ్డీలు చెల్లిస్తూపోతే క్రెడిట్ స్కోర్ పెరుగుతుందని చాలామంది అనుకుంటున్నారు. కానీ ఇది అపోహే. ప్రతి నెలా మీ బకాయిలను పూర్తిగా చెల్లించడమే మంచిది. అప్పుడే క్రెడిట్ స్కోర్ పెరగడానికి వీలుంటుంది. కాబట్టి నెలనెలా మీ పూర్తిస్థాయి బకాయి వాయిదాలను చెల్లిస్తూ వడ్డీ చార్జీలకు దూరంగా ఉండండి. దీనివల్ల రుణదాత (బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు)లకు మీ ఆర్థిక క్రమశిక్షణ నచ్చుతుంది. అది అంతిమంగా మీ క్రెడిట్ స్కోర్ పురోగతికి దోహదపడగలదు.

పాత కార్డులపై వాడని పాత క్రెడిట్ కార్డులను క్లోజ్ చేసుకోవాలన్నది మంచి ఆలోచనే. అయితే అది మీ క్రెడిట్ స్కోర్‌ని దెబ్బతీసే అవకాశమున్నది. ఎందుకంటే పాత కార్డులను తీసేస్తే మీకు అందుబాటులో ఉండే మొత్తం రుణ పరిమితి తగ్గిపోతుంది. కాబట్టి మీ పాత కార్డులనూ ఉంచుకోండి. ప్రధానంగా వార్షిక చార్జీలు లేకపోతే అస్సలు వాటిని వదులుకోవద్దు.

ఒక్కటే కార్డు..

అసలు ఒక్క క్రెడిట్ కార్డూ లేకపోవడం కంటే ఒకటైనా ఉండటం ఉత్తమం. అయితే ఒకటికి మించి క్రెడిట్ కార్డులు ఉండటం వల్ల మీ రుణ పరపతికి అవి అడ్డం పడుతాయి. రివార్డు పాయింట్లు పెరిగి మీ క్రెడిట్ స్కోర్, అందుబాటులో ఉండే రుణ లభ్యత కూడా పెరుగుతుంది. కనుక రోజువారీ అవసరాలకు, ప్రయాణాలు లేదా రివార్డులకు, తక్కువ అధిక రుణాల కోసం ఇలా వేర్వేరు అవసరాలకు 2–3 క్రెడిట్ కార్డులను మెయింటేన్ చేయండి.

రుణ భారం

క్రెడిట్ కార్డులను దుర్వినియోగం చేస్తేనే రుణ భారం పెరుగుతుంది. నిజానికి సరిగ్గా వాడితే ఇవి శక్తివంతమైన ఆర్థిక సాధనాలే. వడ్డీరహిత రుణాలు, రివార్డులు తదితర ప్రయోజనాలను పొందవచ్చు.

కొత్త కార్డులు

క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవడం వల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది అన్నది కూడా పూర్తిగా నిజం కాదు. అయితే అతిగా క్రెడిట్ కార్డుల కోసం ఆరా తీయడం, దరఖాస్తులు చేసుకోవడం మాత్రం ఇబ్బందికరమే. కానీ ఏటా ఒకటి లేదా రెండు విచారణలు క్రెడిట్ కార్డుల కోసం చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌కు దీర్ఘకాలంలో వచ్చే ప్రమాదమేమీ లేదు. పైగా కొత్త కార్డుతో క్రెడిట్ స్కోర్ పెరిగేందుకే ఎక్కువగా అవకాశాలున్నాయి.

డెబిట్ కార్డులే ఉత్తమం..

క్రెడిట్ కార్డుల కంటే డెబిట్ కార్డులే ఉత్తమమన్న అభిప్రాయం చాలామందిలో ఉన్నది. అయితే మీ ఖాతాలో నగదు నిల్వలున్నప్పుడే డెబిట్ కార్డులకు విలువ. కానీ క్రెడిట్ కార్డులతో చేతిలో నగదు లేకున్నా.. కనీస అవసరాలను తీర్చుకునే వెసులుబాటు ఉంటుంది. షాపింగ్‌లు, ఇతర కొనుగోళ్లలో నగదు రాయితీలు, ప్రోత్సాహకాలనూ పొందవచ్చు. అయితే మితిమీరిన ఖర్చులు చేస్తే మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయం. కాబట్టి వివేకంతో వ్యవహరించాలి

# తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్ విజయవంతం.. భారీగా హాజరైన విద్యార్థులు




కరీంనగర్, జులై 7:: జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్లో నిర్వహించిన తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్ సమావేశం విజయవంతమైంది. ఉన్నత విద్య చదువుల కోసం ఏర్పడిన సందేహాలను నివృత్తి చేసుకోవడానికి జగిత్యాల జిల్లాలోని పలువురు విద్యార్థులు భారీగా హాజరయ్యారు. హెల్పింగ్ హాండ్స్ అధినేత ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో ఉన్నత విద్య, జాతీయ, రాష్ట్ర స్థాయి అవకాశాలు సదస్సు ఏర్పాటు చేశారు.

ఇంటర్, డిగ్రీ, ఐఐటి, నిట్, ట్రిబుల్ ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్టీయూ ప్రవేశ పరీక్షలు, ఎంసెట్ ఇంజనీరింగ్ ప్రవేశాలు తదితర అంశాలపై ఎడ్యుకేషనల్ అవేర్నెస్ సెమినార్ కు ముఖ్య అతిథిగా జేఎన్టీయూ కొండగట్టు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ బీ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడవాళ జ్యోతి, లక్ష్మణ్, ప్రముఖ సామజిక వేత్త గంగ నర్సయ్య, జగిత్యాల జిల్లా ఆర్టీఏ మెంబెర్, వర్తక సంఘ అధ్యక్షుడు కంతాల శ్రీనివాస్, కొక్కుల ప్రభాకర్, మామిడాల మునిందర్, విద్యార్థులు, పేరెంట్స్ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

భవిష్యత్ బాటకు మంచి మార్గం ఎన్నుకొవాలనుకునే తపన ఉన్న విద్యార్థులకు జాతీయ, రాష్ట్ర స్థాయి ఎంట్రన్స్ పరీక్షలు, ఇంజనీరింగ్ టాప్ కాలేజీ అడ్మిషన్ గురించి, వారి సందేహాలను తీర్చారు.

ఉచితంగా ఉస్మానియా యూనివర్సిటి ప్రొపెసర్ ఏ రవీందర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టెక్నికల్ స్పాన్సర్ గా జ్యోతిస్మతి కళాశాలలు, వాగేశ్వరీ, పెద్దపల్లి మదర్ థెరిస్సా కళాశాలలు మేనేజ్మెంట్ గా వ్యవహరించాయి.

ఉస్మానియా, జేఎన్టీయూ యూనివర్సిటీ పరిధిలో గల ప్రముఖ ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, హోటల్ మానేజ్మెంట్, ఫాషన్ డిజైన్, డిగ్రీ, పీజీ తదితర కోర్సుల ప్రవేశాల ఉచిత అడ్మిషన్ గైడెన్స్ కోసం 9700344777 నందు సంప్రదించవచ్చని సూచించారు.

# విఆర్ హైస్కూల్ పేరు మార్చడంపై మంత్రి ఆనం అభ్యంతరం

## –ఎపి విఆర్ హైస్కూల్ లో మున్సిపల్ కార్పొరేషన్ పదం తీసేయాలి
## –మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అమరావతి జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఎపి విఆర్ హైస్కూల్ లో మున్సిపల్ కార్పొరేషన్ పదం తీసేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విఆర్ హైస్కూల్ పేరు మార్చడంపై మంత్రి ఆనం అభ్యంతరం తెలిపారు. నెల్లూరు విఆర్ స్కూల్ ప్రారంభ కార్యక్రమంలో ఆనం వివాద వ్యాఖ్యలు చేశారు. విఆర్ విద్యాసంస్థలు తమ కుటుంబం పర్యవేక్షణలో ఉన్నాయని అన్నారు. వైసిపి ప్రభుత్వం కక్షతో మేనేజింగ్ కమిటీ అధ్యక్ష పదవి నుంచి నన్ను తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థగా మారిస్తే ఇబ్బందులు వస్తాయని చెప్పారు. ప్రభుత్వ బడులను దత్తత తీసుకోవాలని అధికారులను కోరారు. విద్యాసంస్థల ద్వారా ఎదిగాకే మంత్రి నారాయణ రాజకీయాల్లోకి వచ్చారని తెలియజేశారు. తమ కుటుంబం మొదటి నుంచీ రాజకీయాల్లోనే ఉంది ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.






# ఈ నెల 14న ఢిల్లీ వెళ్లనున్న చంద్రబాబు


అమరావతి, జులై 7: ఏపీ సీఎం చంద్రబాబు మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈనెల 14న ఢిల్లీ వెళ్లనున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

14న సాయంత్రం ఢిల్లీకి బయల్దేరి వెళ్ళి, మూడు రోజుల పాటు పలువురు కేంద్రమంత్రులను కలవనున్నారు. ముఖ్యంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జలశక్తి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో సమావేశం కానున్నట్టు సమాచారం.

# అక్బరుద్దీన్‌కు ఒక న్యాయం.. అట్టడుగు పేదలకు ఇంకో న్యాయమా..

## – అక్బరుద్దీన్ కాలేజీల్లో చదివే వాళ్ల జీవితాల మీకు ముఖ్యమా..
## – మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వేలాది మంది పేదల జీవితాలు మీకు పట్టవా..
## – కష్టపడి చెమటోడ్చి ఇండ్లు కట్టుకున్న మధ్య తరగతి ప్రజలు బతుకులు మీకు లెక్కలేవా..
## –తక్షణమే అక్రమంగా నిర్మించిన అక్బరుద్దీన్ కాలేజీ భవనాన్ని కూల్చివేస్తారా.. లేదా..
## –లేకుంటే ప్రజల పక్షాన ఆ పని మేమే చేస్తాం
## –కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ స్టేట్ చీఫ్ రామచంద్రరావు అల్టిమేటం
## –మీడియా సంస్థలపై బీఆర్ఎస్ దాడులు దుర్మార్గమని వ్యాఖ్య
## –మీడియా సంస్థలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన రామచంద్రరావు
## –తక్షణమే బీజేవైఎం కార్యకర్తలు ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థలకు రక్షణ కల్పించాలని ఆదేశం
## –మీడియా సంస్థలపై చేయి వేశారో... టీ న్యూస్ ఛానల్ అంతు చూస్తామని అల్టిమేటం

హైదరాబాద్ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );పాతబస్తీ సల్కం చెరువు భూమిలో అక్బరుద్దీన్ ఒవైసీ కాలేజీ కట్టిన మాట వాస్తవమేనని, అందులో 10 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నందున వారి జీవితాలను నాశనం చేయలేమని ఇయాళ కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని,మూసీ పరివాహక ప్రాంతంలో, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వేలాది మంది పేదలు, చెరువు శిఖం భూములని తెలియక డబ్బులు పెట్టి కొని ఇండ్లు కట్టుకున్న మధ్య తరగతి ప్రజల ఇండ్లను ఎందుకు కూలుస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామ చంద్ర రావు ప్రశ్నించారు. . వాళ్లు మనుషులు కాదా.. వాళ్లవి జీవితాలు కావా.. వాళ్లకు కుటుంబాలు లేవా.. అట్లాంటి వాళ్ల ఇండ్లు ఎందుకు కూలగొడుతున్నరు.. వాళ్ల జీవితాలను రోడ్డు పాలేందుకు చేస్తున్నరు.. అక్బరుద్దీన్ కాలేజీకి ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా.. కాంగ్రెస్ మార్క్ ఇందిరమ రాజ్యమంటే ఇదేనా..అని పేర్కొన్నారు. నిజంగా అందరికీ ఒకటే న్యాయమైతే అక్బరుద్దీన్ కాలేజీ భవనాన్ని ఎందుకు కూల్చరు.. గతేడాది నోటీసులిచ్చి గడువు పెట్టారు కదా.. విద్యా సంవత్సరం కూడా ముగిసిన వెంటనే కూల్చివేస్తే... ఆ కాలేజీ యాజమాన్యం వేరే బిల్డింగ్ చూసుకునేది కదా? విద్యార్థులకు ప్రత్యామ్నాయ కాలేజీల్లో అవకాశం కల్పించాలి కదా.. ఇవేమీ చేయకుం డా అక్బరుద్దీన్ చెరువులు, పేదల భూములు, ప్రభుత్వ భూములు కబ్జా చేసినా, దాదాగిరి చేసినా, ఆఖరకు కరెంట్ బిల్లులు కట్టకపోయినా.. తీవ్రవాదులకు ఆశ్రయమిచ్చినా వాళ్లకు రక్షణ కల్పిస్తామంటే చూస్తూ ఊరుకోవాలా.. తక్షణమే అక్బరుద్దీన్ కాలేజీని కూల్చివేయాలి. లేకుంటే బీజేపీ ఆ పనిచేస్తుందని హెచ్చరించారు.ఏబీఎన్, ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై బీఆర్ఎస్ మూకలు దాడులకు తెగబడుతున్నాయని ఇప్పుడే పోలీసుల నుండి సమాచారం వచ్చింది. బీఆర్ఎస్ నేతలు బరితెగించి వ్యవహరిస్తున్నారు. ప్రజలు ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మడం లేదని గ్రహించి ఏం చేయాలో తెల్వక అత్త మీద కోపం దుత్తమీద తీసినట్లు మీడియా సంస్థలపై దాడులకు తెగబడుతున్నారు. మొన్న మీడియా సంస్థలపై దాడులు చేసేందుకు సిద్ధమైనరు. నేను ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా... తక్షణమే మీడియా సంస్థలకు రక్షణ కల్పించాలి. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ఒకవేళ మీడియా సంస్థలు ఏదైనా తప్పుగా రాస్తే చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. అవసరమేతే మీడియా సంస్థలకు బీజేపీ రక్షణ కవచంగా నిలుస్తుంది. తక్షణమే మీడియా కార్యాలయాలకు తగిన రక్షణ కల్పించాలని ఇప్పుడే బీజేపీ యువ మోర్చా నాయకులను ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భ ంగా బీఆర్ఎస్ నాయకులను హెచ్చరిస్తున్నా...ఇకపై మీడియా సంస్థలపై, అమాయక ప్రజలపై దాడులు చేశారో ఖబడ్దార్.... మీ అంతు చూస్తాం. మీలాగే మేం ఆలోచిస్తే మీ బూతు ఛానల్ "టీ"న్యూస్‌ను ఎప్పుడో భూస్థాపితం చేసే వాళ్లం. కానీ మీడియా సంస్థలను బీజేపీ గౌరవిస్తోంది. మాకు వ్యతిరేకంగా రాసినా, కథనాలు ప్రచారం చేసినా తప్పులుంటే సరిదిద్దుకుంటాం. కావాలని తప్పుడు వార్తలు రాస్తే చట్ట, న్యాయపరంగా ముందుకు వెళతామే తప్ప దాడులు చేయబోం. ఎందుకంటే వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించే పార్టీ బీజేపీ. అందుకే బీఆర్ఎస్ నాయకులను హెచ్చరిస్తున్నా.... మీడియా సంస్థలపై దాడులు చేశారో 14 కోట్ల మంది బీజేపీ కార్యకర్తలు, కోట్లాది మంది నరేంద్రమోదీగారి అభిమానులు తలుచుకుంటే మీరు అడుగు కూడా బయటపెట్టలేరనే సంగతిని గుర్తుంచుకోవాలని రామచంద్ర రావు హెచ్చరించారు.



# బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

## -రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## -ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలోని బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనార్టీ పేద ప్రజలకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో చెక్కపల్లి బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ వేములవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవ,వ ంందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు..

వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ జరగాలని 31 సంవత్సరాలుగా పోరాటం చేశారని అన్నారు. ఎమ్మార్పీఎస్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన మరుక్షణమే భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం తెలిపి,డా బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వర్గీకరణ అమలు చేయడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ పేద వర్గాల చిరకాల సమస్యలను తీర్చడం జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ, మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ నెల జూలై 10 న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

## - 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ.

హైదరాబాద్, జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స); : ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మెడ్ ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 10 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. మెడ్ ప్లస్ ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫారసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 30 ×సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్((UEI &GB/MCC)ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ. 12,000 నుండి రూ. 25,000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు . సాయి శైలేష్, ఊఖీ (ఫోన్ నెం. 9666662481) ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో (UEI &GB/MCC)వద్ద నేరుగా జూలై 10,2025 న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏకాదశి పర్వదినాన శ్రీరామకృష్ణ సేవా సమితిలో 'లిఫ్ట్ ఎలివేటర్' ప్రారంభోత్సవం

## -లిఫ్ట్ దాతలకు ధన్యవాదాలు తెలియజేసిన సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి.



హనుమకొండ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భగవాన్ శ్రీ రామకృష్ణ ధ్యాన మందిరానికి కీ.శే. గాజులపల్లి సత్యమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుదు గాజులపల్లి రవీందర్ రెడ్డి సుమారు 6.50 లక్షల విలువగల లిఫ్టను బహుకరించారు. ఈ లిఫ్ట్ ను సత్యమ్మ భర్త గాజులపల్లి గోపాల్ రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా హనుమకొండ వరంగల్ పట్టణాలలో గల ప్రముఖ ఆధ్యాత్మిక ఒ సామాజిక సేవా సంస్థల ప్రతినిధులచే ఆత్మీయ సమ్మేళనం శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. అనేకమంది దాతల సహాయ సహకారాలతో నిర్మితమవుతున్న భగవాన్ శ్రీ రామకృష్ణ ధ్యాన మందిరానికి ఆరున్నర లక్షల విలువగల లిఫ్ట్ ను బహుకరించిన దాతల సేవా సమితి అధ్యక్షులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో పనిచేస్తున్నటువంటి ఆధ్యాత్మిక-సామాజిక సేవా సంస్థలు ఒక్కటై ఓరుగల్లు పట్టణాన్ని సామాజిక సేవా రంగాలలో ముందు ఉంచాలని సత్యనారాయణ రెడ్డి కోరారు. హనుమకొండ పట్టణంలో గల సాయిబాబా దేవాలయ ట్రస్ట్ పిఆర్ఓ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ విలువలతో కూడిన సభ్య సమాజ అవసరం అందులో సామాజిక సంస్థల భాగస్వామ్యం ఎలా ఉండాలో వివరించారు. చింతగట్టు లోని మహర్షి గోశాల నిర్వాహకులు శ్రీ సజ్జన రమేష్ గారు మాట్లాడుతూ వయో వృద్ధులు సమాజానికి ఈ విధంగా కృషి చేయడం ఎంతో అభినంద నీయమని అదే సందర్భంలో యువకులు తప్పనిసరిగా సామాజిక సేవారంగంలో ముందుకు రావాలని అప్పుడే భవిష్యత్ తరాలకు మంచి సమాజాన్ని అందించిన వారమవు తామని తెలిపారు. శివానంద కల్చరల్ ట్రస్ట్ అధ్యక్షులు త్రిపురనేని గోపీచంద్ మాట్లాడుతూ యువత పాశ్చాత్య భావజాలంలో పడకుండా సనాతన భారతీయ విలువలను పాటించాలని కోరారు. మనం ఏ దేశంలో ఉన్నప్పటికీ మాతృభూమిని, కన్న తల్లిదండ్రులని మరువరాదని కోరారు. హనుమకొండలోని సాయి సేవా ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ చిన్నాల రంగయ్య గారు మాట్లాడుతూ మనం ఎన్ని సంపదలు కూడ బెట్టినప్పటికీ నిజమైన ఆనందం అనేది మానవ సేవలోనే లభిస్తుందని తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సౌమిత్రి లక్ష్మణాచార్య మాట్లాడుతూ ఓరుగల్లు పట్టణం కళలకు, సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు పెట్టింది పేరని ఎందరో మహానుభావులు ఈ గడ్డపై జన్మించి తమ భావ చైతన్యంతో భరతమాత సేవలో తరించారని ఎందరికో ఆదర్శప్రాయు లైనారని తెలిపారు. ఖమ్మం రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి శ్రీ సత్య ప్రసాద్ రాయ్ మాట్లాడుతూ చిన్న అద్దె కుటీరంలో ప్రారంభమైన శ్రీ రామకృష్ణ సేవా సమితి ఈరోజు పట్టణంలో సొంత భవనంలో ఈ స్థాయిలోకి రావడం అభినందనీయమని, ప్రస్తుత సమాజానికి భగవాన్ శ్రీ రామకృష్ణుల మరియు వివేకానందుని బోధనలు అత్యంత ఆవశ్యకమని తెలియజేశారు. క్రెడాయ్ వరంగల్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి గారు మాట్లాడుతూ క్రెడాయ్ తరుపున వస్తున్నటువంటి సిఎస్ఆర్ ఫండ్స్ అన్నింటిని సామాజిక సేవా సంస్థలకు విరాళంగా ఇస్తూ తమ వంతు బాధ్యతను నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. వరంగల్ క్రెడాయి నూతన అధ్యక్షులు నాయిని అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులోకూడా తమ సంస్థ తరఫున వివిధ సామాజిక సేవా సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్ డాక్టర్లని, యోగా గురువు ఆంజనేయులు, సేవాసమితి పూర్వ అధ్యక్షులు కె. శ్రీనివాస స్వామి, ప్రధాన కార్యదర్శి జినుగు విష్ణువర్ధన్ రెడ్డి, కోశాధికారి కొప్పుల వెంకటేశ్వరరావు శ్రీమతి అంజనీదేవి, సూర్య, రాధిక, తిరుపతిరెడ్డి, భాస్కర్, సరోజన, శ్రీలక్ష్మి, అరుణ్, పార్వతి, లక్ష్మీదేవి, శిల్ప తదితర భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అర్హత ఉన్న ప్రతి 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించాలి

## -బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును కలిసిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం



హైదరాబాద్ జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న అర్హత ఉన్న ప్రతి 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కమ్యూనిటీ చైర్మన్ శ్రీ బండి రమేష్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ప్రతినిధి బృందం, తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ (బిజెపి) గౌరవ అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావును కలిసి వినతి పత్రం సమర్పించింది. వవ కార్యక్రమం లో 12 సంవత్సరాలకు పైగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక డిమాండ్లు మరియు సమస్యలను హైలైట్ చేస్తూ ప్రతినిధి బృందం ఒక ప్రాతినిధ్యాన్ని సమర్పించింది.

1. అర్హత ఉన్న ప్రతి పాల్గొనేవారికి 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయింపు.

2. తెలంగాణ ఉద్యమ కార్యకర్తలకు నెలవారీ 25,000/- పెన్షన్ మంజూరు.

3. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వ్యక్తులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవడం.

4. తెలంగాణ అమరవీరులు మరియు పోరాట యోధులను అధికారికంగా గుర్తించడం మరియు సత్కరించడం.

5. తెలంగాణ పోరాటంలో గణనీయమైన పాత్ర పోషించిన అర్హులైన కార్యకర్తలందరికీ అదనపు సంక్షేమ ప్రయోజనాలు మరియు అధికారిక గుర్తింపు.

ఈ కార్యక్రమం లో శ్రీ బండి రమేష్, చైర్మన్,శ్రీ వెంకటేష్ గౌడ్, సభ్యుడు,శ్రీ వేణుగోపాల్ రెడ్డి, సభ్యుడు,కమ్యూనిటీలోని ఇతర క్రియాశీల సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన బిఆర్ఎస్ నాయకులు

రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): కేసిఆర్ ప్రారంభించిన హరిత హారం కార్యక్రమం చేపట్టి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేములవాడ నియోజకవర్గ హరిత సేన కమల్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం బిఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా వేములవాడ మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు మాట్లాడుతూ హరిత హారం పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గౌరవ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో పాల్గొని హరిత హారం గుర్తుగా స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కోసం కేసిఆర్ పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా రాష్ట్ర మంతటా కోట్ల మొక్కలు నాటి తెలంగాణ అంతటా పచ్చదనాన్ని తీసుకువచ్చారన్నారు. మొక్కలు నాటితేనే సరైన సమయంలో వర్షాలు కురుస్తాయని, బావి తరాలకు కూడా మంచి ఆక్సిజన్ అందించవచ్చని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఇప్పటి వరకు ఎక్కడ కూడా మొక్కలు నాటలేదని, నర్సరీల్లో ఎక్కడి మొక్కలు అక్కడే ఉన్నాయని, అందుకే మేము గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా ఎక్కడ చిన్న మంచి కార్యక్రమం జరిగిన అందులో పాల్గొని వారితో కలిసి హరిత సేన టీమ్ వారు మొక్కలు నాటిపిస్తున్నారన్నారు. ఇది మంచి పరిణయం అని, ఇలాగే మేము కూడా ఏదైనా సందర్భంలో కాని మా వంతుగా హరిత హారం గుర్తు చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి కేసిఆర్ కు కానుకగా అందిస్తాం అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కందుల క్రాంతి కుమార్ వసల శ్రీనివాస్, సిరిగిరి చెందు, గోపు గణేష్, బియ్యాల ప్రమోద్, గ్రీన్ హరిత సేన జిల్లా జిల్లా ఇంచార్జి కమల్ గౌడ్, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి నీరటీ కుమార్, టౌన్ ఇన్చార్జి సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఏనుగు మనోహర్ పరామర్శ



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆలయ ఉద్యోగి నేరెళ్ళ పురుషోత్తం ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. పురుషోత్తం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మాజీ కౌన్సిలర్లు నరాల శేఖర్,విజయ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# బాధితులకు బీఆర్ఎస్ నేత చెల్మెడ పరామర్శ



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి మండల కేంద్రంలో గుండె సంబంధించిన ఆపరేషన్ చేయించుకున్న బిఆర్ఎస్ కార్యకర్త గంగరాజం, వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా గ్రామానికి చెందిన చొక్కాల అంజవ్వ అనారోగ్యంతో బాధపడుతూ చల్మెడ ఆసుపత్రిలో అడ్మిట్ కాగా, వారిరువురిని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

## -జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



రాజన్న సిరిసిల్ల, జులై 7:(నేటినిజం ప్రతినిధి): ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# హర్యానాలో దారుణం.. రైలు బోగీలో మహిళపై సామూహిక అత్యాచారం..

## – ఆపై రైలు పట్టాలపై పడేసి..!

హర్యానా జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆమె వివాహిత మహిళ. భర్తతో గొడవపడి బయటికి వెళ్లింది. రాత్రి రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా కూర్చున్న ఆమెను ఓ వ్యక్తి రైలు బోగిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత అతని ఇద్దరు స్నేహితులు అక్కడికి వచ్చి వాళ్లు కూడా అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత నిస్సహాయ స్థితిలోకి వెళ్లిన మహిళను సోనిపట్ కు తీసుకెళ్లి రైలు పట్టాలపై పడేసి పారిపోయారు. రైలు కాలు పైనుంచి పోవడంతో ఆమె కాలు తెగిపోయింది. హర్యానా లోని పానిపట్ లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పానిపట్‌కు చెందిన మహిళ ఈ నెల 24న భర్తతో గొడవ పెట్టుకుని బయటికి వెళ్లింది. గతంలో కూడా ఇలాగే వెళ్లి మరుసటి రోజు తిరిగి రావడంతో అతడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే రెండు రోజులైనా రాకపోవడంతో జూన్ 26న ఖ్విల్లా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సదరు మహిళ కోసం గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు జూలై 6న (ఆదివారం) పోలీసులకు ఆమె ఆచూకీ లభ్యమైంది. కాలు కోల్పోయి సోనిపట్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం స్పృహలోకి వచ్చి జరిగిన దారుణం గురించి వెల్లడించింది. తాను భర్తతో గొడవ తర్వాత పానిపట్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి కూర్చున్నానని, అక్కడికి ఓ వ్యక్తి మీ భర్త పంపించాడని చెప్పి వచ్చాడని, ఇంటికి తీసుకెళ్తానని చెప్పి ఓ ఖాళీ రైలుబోగీలోకి తీసుకెళ్లాడని, అక్కడ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆపై మరో ఇద్దరిని పిలిపించి అత్యాచారానికి పాల్పడ్డారని, వాళ్లతో పెనుగులాడి తాను అలసిపోయానని, నిస్సహాయ స్థితిలో తనను సోనిపట్‌కు తీసుకెళ్లి రైలుపట్టాలపై పడేసి పారిపోయారని, రైలు కాలుపై నుంచి వెళ్లడంతో తను కాలు కోల్పోయానని, ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని, స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నానని ఆమె చెప్పారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

# మహీంద్రా, హిరోషిమా యూనివర్శిటీల భాగస్వామ్యం



హైదరాబాద్, జులై 7: మహీంద్రా యూనివర్శిటీ జపాన్‌లోని ప్రఖ్యాత హిరోషిమా యూనివర్శిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఒప్పందంపై మహీంద్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మెదురి, హిరోషిమా యూనివర్శిటీ అధ్యక్షులు డాక్టర్ మిత్సుఓ ఓచిలు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ప్రపంచ స్థాయి విద్యా నైపుణ్యం, పరిశోధన ఆవిష్కరణ, సాంస్కృతిక మార్పిడికి ఇది ఒక ముందడుగుగా చెప్పవచ్చు. ఈ భాగస్వామ్యంలో 3+1 ఇంజనీరింగ్ అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఉంది. ఇందులో విద్యార్థులు మొదటి మూడు సంవత్సరాలు హైదరాబాద్‌లో, చివరి సంవత్సరం హిరోషిమా యూనివర్శిటీలో విద్యను అభ్యసిస్తారు. జపాన్‌లో గడిపే సమయంలో కోర్సు పూర్తి చేయడమే కాకుండా గ్రాడ్యుయేషన్ థీసిస్‌ను కూడా రూపొందించాల్సి ఉంటుంది. ఇది పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు హిరోషిమా యూనివర్శిటీ నుంచి ఒక సర్టిఫికెట్, మహీంద్రా యూనివర్శిటీ నుంచి తుది డిగ్రీ లభిస్తుంది. హిరోషిమాలో పొందిన క్రెడిట్స్‌ను మహీంద్రా యూనివర్శిటీ తుది డిగ్రీలో విలీనం చేస్తుంది. మహీంద్రా యూనివర్శిటీకి చెందిన తొలి బ్యాచ్ విద్యార్థులు 2026 విద్యా సంవత్సరంలో హిరోషిమాలో తుది సంవత్సరం చదువును ప్రారంభించనున్నారు. ఈ అరుదైన అవకాశానికి ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. విద్యార్థులు హిరోషిమా యూనివర్శిటీలో ట్యూషన్ ఫీజు చెల్లించాలి. పరీక్షా ఫీజు, ప్రవేశ ఫీజును యూనివర్శిటీ మాఫీ చేయనుంది.

ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మెదురి మాట్లాడుతూ పరిశోధనలో అగ్రగామిగా ఉన్న హిరోషిమా యూనివర్శిటీతో భాగం కావడం గర్వంగా ఉందన్నారు. విద్య అంతర్జాతీయ స్థాయిలో ఉండాలన్న మా లక్ష్యంలో ఇది ఒక కీలకమైన మైలురాయి అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా మా విద్యార్థులు హిరోషిమాలో చివరి సంవత్సరం చదవడం అకడమిక్, సాంస్కృతికంగా ఎంతో ప్రయోజనకరం అన్నారు. పరస్పర సంబంధాలతో నడిచే ప్రపంచంలో గ్లోబల్ నిపుణులను తయారు చేయడమే ఉమ్మడి లక్ష్యమన్నారు. ఈ డిగ్రీతో పాటు ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టుల ప్రోత్సాహం, అధ్యాపకులు, పరిపాలన సిబ్బంది మార్పిడి, అండర్‌గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థుల పరస్పర మార్పిడి, అకడమిక్ ప్రచురణలు, పరిశోధన ఫలితాల పరస్పర వినిమయం కూడా ఉంటాయన్నారు.

ఈ సందర్భంగా హిరోషిమా యూనివర్శిటీ అధ్యక్షులు డాక్టర్ మిత్సుఓ ఓచి మాట్లాడుతూ విద్యా ప్రావీణ్యాన్ని పెంపొందించనున్నామని తెలిపారు. యువ ప్రతిభను నైపుణ్యంగా తీర్చిదిద్దడం, ప్రపంచ ప్రాధాన్యత గల అంశాలపై ఉమ్మడిగా పరిశోధనలు చేయడం లక్ష్యమన్నారు. హిరోషిమా విశ్వవిద్యాలయం ప్రపంచ విద్యా నెట్‌వర్క్‌లోకి మహీంద్రా విశ్వవిద్యాలయాన్ని స్వాగతిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నామన్నారు.

# గౌరాయిపల్లి టాస్కా కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు

## -గుట్ట మండల టాస్కా అధ్యక్ష కార్యదర్శులు ముడుంబై జయమోహనాచార్య, పులుగం చక్రపాణి వెల్లడి

యాదగిరిగుట్ట, జూలై 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ( టాస్కా ) కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభం అయ్యాయని మండల టాస్కా అధ్యక్ష కార్యదర్శులు ముడుంబై జయమోహనాచార్య, పులుగం చక్రపాణి తెలిపారు. సోమవారం మండల టాస్కా నాయకుడు నూకల సుధాకర్ రెడ్డి తో కలిసి తాము గ్రామంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో పాల్గొన్న గ్రామ మాజీ సర్పంచ్ సిరికొండ సత్యనారాయణ అదేవిధంగా మల్లారెడ్డి, గ్రామ పెద్దలు, వయోజనులు హాజరయ్యారని ,ఒకటి రెండు రోజుల్లో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని తెలిపారని చెప్పారు. టాస్కా ప్రచార ఉద్యమంలో భాగంగా ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో గ్రామ గ్రామాన వయోజనులు భారీ సంఖ్యలో పాల్గొని చైతన్యం పొందారని వారు వివరించారు .గ్రామ వయోజనులకు అతి త్వరలోనే యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి సీనియర్ సిటిజన్స్ కార్డులను ఇప్పించడం జరుగుతుందన్నారు. టాస్కా కృషి వల్ల గ్రామాల్లో వయోజనులు ఏకతాటిపై వస్తున్నారని, ఫలితంగా గ్రామాల్లో వయోజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలు స్థానికంగానే అత్యధిక భాగం పరిష్కారం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.